సోమవారం
MONDAY
23-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 144

జగిత్యాల
JAGITIAL
||
పేజీలు: (PAGES):8
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





గుండె గూడు.. చిన్నగైతున్నది!

నైట్ షిఫ్ట్ చేసేవారిలో గుండె నిర్మాణంలో తేడాలు

రాత్రిళ్లు మేల్కొనడం వల్ల దెబ్బతింటున్న జీవ గడియారం.. 42 వేల మంది పై పరిశోధకుల విస్తృత అధ్యయనం

బీపీ షుగర్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు వచ్చే ప్రమాదం

తెల్లవారేసరికి పత్రిక పాఠకుడి చేతికి రావాలన్నా, అర్ధరాత్రి ఆసుపత్రికి వచ్చిన రోగికి వైద్యం అందాలన్నా ఎవరో ఒకరు రాత్రంతా మేల్కొని పనిచేయాలి. మరి తరచూ రాత్రి డ్యూటీ చేసేవారి గుండె ఎలా ఉంది? 42 వేల మందికి పైగా గుండె స్కాన్లను పరిశీలించిన పరిశోధకులకు ఓ చిన్న తేడా కనిపించింది. పగటి పూట పనిచేసేవారితో పోలిస్తే, తరచూ రాత్రి షిఫ్టులు చేసేవారిలో శరీరానికి రక్తాన్ని పంపే గుండె గది గోడ సగటున కాస్త మందంగా మారుతోందట.

(ఈవార్తలు - స్పెషల్ బ్యూరో)

ఐటీ, పరిశ్రమలు, అత్యవసర సేవలు వంటి విభాగాల్లో పనిచేస్తూ నిరంతరం నైట్ షిఫ్టులు చేసేవారి గుండె పనితీరు, నిర్మాణంలో మార్పులు వచ్చే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. దీర్ఘకాలం పాటు రాత్రి వేళల్లోనే విధులు నిర్వర్తించే వారి గుండె కండరాల గోడలు కొంత మందంగా మారడంతో పాటు, గుండె లోపలి గదుల (చాంబర్స్) పరిమాణం కాస్త తగ్గుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు దాదాపు 42,671 మందికి సంబంధించిన ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించారు. వీరిలో క్రమం తప్పకుండా నైట్ షిఫ్టులు చేసే 1,322 మందిని ప్రత్యేకంగా పరిశీలించారు. వీరి సగటు వయసు 52 సంవత్సరాలు.



నిరంతరం -2 వ పేజీలో...



కడుపు కోత..!

పది ప్రసవాల్లో ఆరు సిజేరియన్లే

సిజేరియన్ ప్రసవాల్లో దేశంలోనే తెలంగాణ టాప్

రాష్ట్రంలో 62.2 శాతం.. జాతీయ సగటు 27.2 శాతమే

ప్రైవేటు ఆస్పత్రుల్లో 83.9 శాతం ఆపరేషన్ ప్రసవాలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ 48.1 శాతం నమోదు

ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 సర్వేలో వెల్లడైన గణాంకాలు

తెలంగాణలో సిజేరియన్ ప్రసవాల సంఖ్య పెరుగుతున్న తీరు ప్రజారోగ్య రంగంలో చర్చనీయాంశంగా మారింది. దేశంలో అత్యధికంగా సిజేరియన్ ప్రసవాలు నమోదవుతున్న రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ప్రతి పది ప్రసవాల్లో ఆరుకు పైగా సిజేరియన్ ద్వారానే జరుగుతున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)-6 గణాంకాలు వెల్లడించాయి. తెలంగాణలో సిజేరియన్ ప్రసవాల రేటు 62.2 శాతం ఉండగా, దేశవ్యాప్తంగా సగటు 27.2 శాతంగా నమోదైంది. అంటే జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల రేటు రెండింతలకు పైగా ఉంది. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో ఏకంగా 83.9 శాతం సిజేరియన్లే కావడం వైద్య నిపుణులను ఆలోచింపజేస్తోంది. అవసరం లేని ఆపరేషన్ ప్రసవాలను గుర్తించేందుకు ఆస్పత్రుల వారీగా సమీక్షలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6 (2023-24) వివరాల ప్రకారం తెలంగాణలో సిజేరియన్ ప్రసవాల రేటు 62.2 శాతానికి చేరింది. గత ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 (2019-21) సర్వేలో ఈ రేటు 60.7 శాతంగా నమోదైంది. అంటే రెండు సర్వేల మధ్య 1.5 శాతం పాయింట్ల పెరుగుదల కనిపించింది. జాతీయ సగటు 27.2 శాతంతో పోలిస్తే తెలంగాణలో నమోదైన రేటు 35 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ సిజేరియన్ ప్రసవాల రేటులో తేడా కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 70.1 శాతం ప్రసవాలు ఆపరేషన్ ద్వారా జరుగుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 59.5 శాతంగా నమోదైంది. పట్టణాల్లో ప్రతి పది ప్రసవాల్లో ఏడు సిజేరియన్లే కావడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల మధ్య సిజేరియన్ ప్రసవాల

కొట్టేసుకుందామా..?

నాతో కలిసి ఉంటారా? లేదా?

సమస్య ఉంటే నా దగ్గరికి రండి

విమర్శలతో మళ్లీ గెలుస్తామా?

కాంగ్రెస్ పార్టీ భేటీలో సీఎం రేవంత్



"మీకేదైనా సమస్య ఉంటే నాతో వచ్చి మాట్లాడండి" అంటూ సొంత పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. బహిరంగ సభల్లో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుని పార్టీ పరువు తీస్తే వచ్చే ఎన్నికల్లో ఎలా గెలుస్తామని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. వారిద్దరి విషయంలో ఈసారికి చర్యలు తీసుకోకుండా వదిలేస్తే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం.

హైదరాబాద్, నవంబరు 22 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్తగా నియమితులైన ఇన్‌చార్జి సందీప్‌కు స్వాగతం పలికిన అనంతరం జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఎమ్మెల్యేల వ్యాఖ్యలు చర్చకు వచ్చాయి. కొందరు నేతలు పార్టీ అప్పగించిన పనులపై శ్రద్ధ పెట్టకుండా తనకే ఏం చేయాలో చెబుతున్నారంటూ రేవంత్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా చూడాలని పార్టీ బాధ్యత అప్పగిస్తే, ఆ ఒక్క పనికే ఎన్నిసార్లు సమావేశాలు పెట్టాల్సి వచ్చిందో గుర్తుచేసుకోవాలని ఆయన అన్నట్లు సమాచారం. ఇద్దరు ఎమ్మెల్యేల విషయంలో తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని రేవంత్ చెప్పినట్లు తెలిసింది. ఇకపై అభ్యంతరాలుంటే పార్టీలోనే చర్చించుకోవాలని, చిన్న తరువాయి 2 వ పేజీలో...



చాలెంజ్ చేస్తావా..?

హామీలు నెరవేరిస్తే రాజకీయాలు వదిలేస్తా

సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్.. 500 రోజుల్లో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో అమలు చేస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ మేరకు బహిరంగ సవాల్ విసిరారు.

హనుమకొండ, నవంబర్ 22 (ఈవార్తలు): ఆదివారం హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ జన చైతన్య సభలో ఆయన ప్రసంగించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీల్లో ఒక్కదాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే రాజకీయాల నుంచి తప్పుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ముఖ్యమంత్రి తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.12,508
వెండి (కిలో):	రూ.1,75,000
ప్లాటినం (గ్రాము):	రూ.3,856

విశ్వవాణి



విశ్వం ఏర్పడిన తొలినాళ్లలోనే భారీ గెలాక్సీలు నక్షత్రాల నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేశాయన్నది ఖగోళ శాస్త్రవేత్తలకు చాలాకాలంగా అంతుపట్టడం లేదు. అప్పట్లో గెలాక్సీల మధ్య ఢీకొనడాలు, విలీనాలు ఎక్కువగా జరిగేవి. అలాంటి ఘటనలు తొలుత నక్షత్రాల నిర్మాణాన్ని వేగవంతం చేసి, ఆ తర్వాత భారీ వాయు ప్రవాహాల ద్వారా ఆ ప్రక్రియకు అవసరమైన ఇంధనాన్ని కోల్పోయేలా చేసి ఉండవచ్చని తాజా పరిశీలనలు సూచిస్తున్నాయి.

వాహనాలపై కులాన్ని సూచించే పేర్లు, గుర్తులు, స్టిక్కర్లు ప్రదర్శించడాన్ని గుజరాత్ ప్రభుత్వం నిషేధించింది. కుల గుర్తింపును వాహనాల ద్వారా ప్రచారం చేసే ధోరణిని నియంత్రించేందుకు మోటార్ వాహనాల నియమావళిలో మార్పులు చేసింది. ఈ మేరకు నవంబర్ 17న 'గుజరాత్ మోటార్ వెహికల్స్ థర్డ్ అమెండ్‌మెంట్ రూల్స్-2026'ను నోటిఫై చేసింది.

షర్మిలకు నో ఎంట్రీ

యలహంక ప్యాలెస్‌లోకి వెళ్లనివ్వని పోలీసులు

అన్నాచెల్లెళ్ల మధ్య ముదిరిన ఆస్తుల వివాదం

విజయమ్మతో కలిసి వచ్చినా అనుమతి నిరాకరణ

వివాహ వేదిక హైదరాబాద్‌కు మార్పు

డిసెంబర్ 19న కోర్టులో విచారణ

బెంగళూరు, నవంబర్ 23 (ఈవార్తలు): వైఎస్ కుటుంబంలో అన్నాచెల్లెళ్ల మధ్య కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం నివాసం ఉంటున్న బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం సాయంత్రం తల్లి వైఎస్ విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు చేరుకున్న షర్మిలను ఎయిర్‌పోర్ట్ క్రాస్ వద్ద నిలిపివేశారు. ప్యాలెస్‌కు వెళ్లకుండా కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. దీంతో షర్మిల పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు కుటుంబ సభ్యులతో కలిసి తరువాయి 2 వ పేజీలో...

నేడు కరీంనగర్‌కు బీజేపీ చీఫ్

బీజేపీ మహా పాదయాత్రకు హాజరు.. కమాన్ చౌరస్తా వరకు యాత్ర

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సోమవారం (నవంబర్ 23) తొలిసారి కరీంనగర్‌కు రానున్నారు. నగరంలో బీజేపీ నిర్వహించే మహా పాదయాత్రలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం గాంధీ విగ్రహం వద్ద యాత్ర ప్రారంభమవుతుంది. వైశ్య భవన్ వద్ద నబిన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. లక్ష మందికిపైగా హాజరవుతారన్న అంచనాతో ఏర్పాట్లు చేసినట్లు పార్టీ నేతలు తెలిపారు.

కరీంనగర్, నవంబర్ 22 (ఈవార్తలు): పార్టీ ప్రకటించిన పర్యటన వివరాల ప్రకారం, నబీన్ మధ్యాహ్నం 12.30 గంటలకు కరీంనగర్ చేరుకుని పాదయాత్రలో పాల్గొంటారు. వైశ్య భవన్ వద్ద ప్రసంగం అనంతరం రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, గడియారం సెంటర్, శాస్త్రి రోడ్, భారత్ టాకీస్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు ప్రజలతో కలిసి నడుస్తారు. యాత్ర ముగిశాక సాయంత్రం 4.30 గంటలకు హైదరాబాద్‌కు తరువాయి 2 వ పేజీలో...

నీళ్ల చోరీ ఆపాలి

పల్నాడు సారంగంపై

కృష్ణా బోర్డుకు బీఆర్ఎస్

సాగర్‌లో హైదరాబాద్ తాగునీటి

నిల్వలు కాపాడాలని వినతి

సోమవారం ఉదయం 10.30కు

బోర్డు అధికారులతో భేటీ

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): నాగార్జునసాగర్ నుంచి నీటిని తరలించేందుకు పల్నాడు వాటర్ గ్రిడ్ కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న సొరంగం పనులపై బీఆర్ఎస్ అభ్యంతరం తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు
23.11.2026

మేషం: వ్యాపారస్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆప్తుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

వృషభం: నూతన కార్యక్రమాలను ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ సందర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక సమాచారం అందుతుంది. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. దీర్ఘకాలిక ఋణ సమస్యలు పరిష్కరించుకుంటారు.

మిథునం: ఉద్యోగస్థులకు స్థానచలనాలు తప్పవు. ఆకస్మికంగా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వృథా ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. కుటుంబమున అదనపు బాధ్యతలు కొంత చికాకు పరుస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులలో ఆటంకాలుంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారమున ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరుగుతుంది. కొన్ని వ్యవహారాలలో అధిక కష్టంతో అల్ప ఫలితం పొందుతారు. దూర ప్రయాణాలలో మార్గవరోధాలు కలుగుతాయి.

సింహం: మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున సమస్యలు తొలగి ఊరట చెందుతారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. శుభ కార్యములకు ధనవ్యయం చేస్తారు.

కన్య: ఉద్యోగులకు ఇతరుల నుండి ఊహించని సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. బంధువర్గంతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ వాతావరణం చికాకు పరుస్తుంది. ధనాదాయ మార్గాలకు అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయట విమర్శలు అధికమౌతాయి.

తుల: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారమున నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత అనుకూలిస్తాయి. ఉద్యోగమున సమస్యలు అధిగమించి ముందుకు సాగుతారు. గౌరవ మర్యాదలకు లోటుండదు. మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

వృశ్చికం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన బాధ్యతలు చేపడతారు. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన వలన శిరోభాధలు తప్పవు.

ధనస్సు: ఆర్థికంగా అనుకూలత కలుగుతుంది. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. గృహమున చిన్ననాటి మిత్రులతో సంతోషంగా గడుపుతారు. వృత్తి వ్యాపారములలో నూతన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: ఆప్తులు నుంచి ధన సహాయం అందుతుంది. ఆదాయ మార్గాలు విస్తృతమౌతాయి. చేపట్టిన పనులలో కార్యజయం కలుగుతుంది. వ్యాపారమున ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగస్థుల కలలు ఫలిస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: సన్నిహితుల నుండి ఊహించని సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. సోదరులతో ఆస్తి వివాదాలు చికాకు కలిగిస్తాయి. ఇతరుల నుండి ఋణ ఒత్తిడులు అధికమౌతాయి.

మీనం: ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. దాయదులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

కడుపు కోత..!



విషయంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. తెలంగాణలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాల్లో 83.9 శాతం సిజేరియన్లు కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 48.1 శాతంగా నమోదైంది. దేశవ్యాప్తంగా చూస్తే ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ప్రసవాల సగటు 54.1 శాతం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 16.9 శాతంగా ఉంది. ఈ లెక్కల ప్రకారం తెలంగాణలో రెండు రకాల ఆస్పత్రుల్లోనూ జాతీయ సగటు కంటే ఎక్కువగా సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. అయితే అధిక సిజేరియన్ రేటు నమోదైనంత మాత్రాన ప్రతి ఆపరేషన్ అనవసరమని నిర్ధారించలేమని, ఆయా ప్రసవాల్లో ఉన్న వైద్యపరమైన కారణాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాల వాటా

తెలంగాణలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటున్నవారి మొత్తం వాటా పెరిగినట్లు సర్వే వెల్లడించింది. ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో ప్రభుత్వ వైద్యశాలల్లో జరిగిన ప్రసవాల వాటా 49.7 శాతంగా ఉండగా, తాజా సర్వేలో 57.5 శాతానికి పెరిగింది. అయితే పట్టణ ప్రాంతాల్లో దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. గత సర్వేలో పట్టణ తెలంగాణలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల వాటా 43.4 శాతం ఉండగా, తాజా సర్వేలో 42.6 శాతానికి తగ్గింది. అదే సమయంలో పట్టణ ప్రాంతాల్లో 99.1 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నట్లు వెల్లడైంది. ఈ గణాంకాలు ప్రభుత్వ వైద్యసేవల వినియోగంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను సూచిస్తున్నాయి.

ఆస్పత్రుల వారీగా ఆడిట్ అవసరం

సిజేరియన్ ప్రసవాల సంఖ్య పెరగడానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించాలని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రూపా బాను అభిప్రాయపడ్డారు. ప్రతి సిజేరియన్ వెనుక సరైన వైద్య కారణం ఉందో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యపరంగా అవసరమైనప్పుడే ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆస్పత్రుల వారీగా సిజేరియన్ ప్రసవాలపై ఆడిట్ నిర్వహిస్తే వాటి సంఖ్య పెరగడానికి కారణాలు గుర్తించవచ్చన్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న అధిక రేటుపై ప్రత్యేక అధ్యయనం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన ప్రసూతి సేవలు అందుబాటులో ఉంటే మహిళల్లో నమ్మకం పెరుగుతుందని ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ కిరణ్ మాధాల పేర్కొన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తగిన సంఖ్యలో ఉండటం, మెరుగైన మౌలిక సదుపాయాలు, సకాలంలో వైద్య పరీక్షలు, అత్యవసర ప్రసూతి సేవలు అందించడం కీలకమన్నారు. గర్భిణులు ప్రసవం కోసం ఆస్పత్రిని ఎంపిక చేసుకునేటప్పుడు వైద్య సదుపాయాలు, అత్యవసర చికిత్స అందుబాటు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధికంగా జరుగుతున్న సిజేరియన్ ప్రసవాల వెనుక ఉన్న కారణాలను నిశితంగా పరిశీలించాలని అభిప్రాయపడ్డారు.

గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పించాలి

సాధారణ ప్రసవం, సిజేరియన్ ప్రసవం మధ్య తేడాలు, వాటి ప్రయోజనాలు, ప్రమాదాల గురించి గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పించాలని అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.హేమలత సూచించారు. గర్భధారణ సమయంలోనే వైద్యులు మహిళల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ప్రసవ విధానంపై తగిన సలహాలు ఇవ్వాలన్నారు. సిజేరియన్ అవసరమా లేదా అన్నది తల్లి, బిడ్డ ఆరోగ్య పరిస్థితి, గర్భధారణలో ఎదురయ్యే సమస్యలు, ప్రసవ సమయంలో తలెత్తే వైద్యపరమైన పరిస్థితుల ఆధారంగా నిర్ణయించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడే కీలక వైద్య విధానమని, అదే సమయంలో వైద్యపరమైన అవసరం లేకుండా ఆపరేషన్లు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



చాలెంజ్ చేస్తావా..?

మొదటి పేజీ తరువాయి

హామీలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అధికారంలోకి వస్తే మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు కనీసం వారిని లక్షాధికారులుగానైనా చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, రైతులు, యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ప్రజల సమస్యలను ప్రస్తావించిన ప్రతిసారీ ముఖ్యమంత్రి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటల గురించి మాట్లాడకుండా ప్రతిపక్ష నేతలను విమర్శించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం సున్నా, అభివృద్ధి గుండుసున్నాగా మారిందని కేటీఆర్ విమర్శించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పర్సంటేజీల పాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వంలో కమీషన్లు, అవినీతి వ్యవహారాలు పెరిగిపోయాయని, ఈ విషయాలను సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే బయటపెడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నాలుగు ఐటీ కంపెనీలను తీసుకొచ్చామని గుర్తుచేశారు. వాటి ద్వారా కనీసం వెయ్యి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేశామని చెప్పారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రారంభించలేదని ఆరోపించారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ కొత్తగా చేసిందేమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మరో 500 రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2028లో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఫ్యూచర్ సిటీని ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు చేశారు. ఆ ఫ్యూచర్ సిటీలో భవిష్యత్తు లేదని, వరంగల్లే అసలైన భవిష్యత్తు నగరంగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్ వంటి నగరాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జన చైతన్య సభ అనంతరం సోషల్ మీడియా వేదికగా కూడా కేటీఆర్ వరంగల్ అభివృద్ధిపై స్పందించారు. వరంగల్ నగరాన్ని 'సిటీ ఆఫ్ ఫ్యూచర్'గా తీర్చిదిద్దాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. సభకు తరలివచ్చిన యువత, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సభ నిర్వహణలో భాగస్వాములైన వరంగల్ అర్బన్ బీఆర్ఎస్ నాయకత్వాన్ని అభినందించారు.

గుండె గూడు... చిన్నగైతున్నది!

మొదటి పేజీ తరువాయి

రాత్రి వేళల్లో పనిచేసే వారి గుండె నిర్మాణంలో స్వల్ప మార్పులు కనిపించినప్పటికీ, గుండె రక్తాన్ని పంప్ చేసే ప్రధాన సామర్థ్యంలో మాత్రం ఎలాంటి పెద్ద తేడా కనిపించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు.

జీవ గడియారం అస్తవ్యస్తం

రాత్రి వేళల్లో మేల్కొని పనిచేయడం వల్ల మానవ శరీర సహజ జీవ గడియారం (బాడీ క్లాక్) పూర్తిగా అస్తవ్యస్తమవుతుందని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనివల్ల రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిల్లో మార్పులు రావడం, శరీరంలో కొవ్వుల సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ పరిస్థితులు దీర్ఘకాలంలో గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయి. అయితే, వారంలో ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే రాత్రి డ్యూటీ చేసేవారిలో ఇలాంటి తీవ్ర ప్రభావాలు కనిపించలేదని, ఏళ్ల తరబడి నిరంతరాయంగా నైట్ షిఫ్టులు చేసేవారిలోనే ఈ సమస్యలు ఎక్కువగా నమోదైనట్లు అధ్యయనం పేర్కొంది.

నైట్ షిఫ్టుల్లో పనిచేసేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- పగటి వేళల్లో అయినా కనీసం 7 నుంచి 9 గంటల పాటు నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోవాలి.
- రాత్రి వేళల్లో వేపుళ్లు, జంక్ ఫుడ్‌కు వీలైనంత దూరంగా ఉండాలి.
- రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్ణీత వ్యవధిలో చెక్ చేసుకోవాలి.
- వైద్యుల సలహాతో సమయానుకూలంగా గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

కొట్టేసుకుందామా..?

మొదటి పేజీ తరువాయి

విభేదాలను బహిరంగ వేదికలపై పెద్దవి చేస్తే నష్టం అందరికీ జరుగుతుందని ఆయన అన్నట్లు సమాచారం. "కలిసుందామా? కొట్టుకుందామా? మీరే చెప్పండి" అంటూ నేతలను ప్రశ్నించిన సీఎం, వచ్చే ఎన్నికలను కలిసికట్టుగా ఎదుర్కోవాలని కోరినట్లు తెలిసింది.

పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగితే ఏం లాభం?

పదవి కావాలనుకునే నాయకులు గాంధీభవన్‌కూ ఢిల్లీకీ ఎన్నిసార్లు వెళ్లారన్నది ఎవరూ లెక్కపెట్టరని, గ్రామాల్లో పేదలకు ఎంతగా అండగా నిలిచారన్నదే పార్టీ చూస్తుందని రేవంత్ అన్నారు. "రాజకీయాల్లో బ్యాలెన్స్ షీట్ ఐదేళ్లకు ఒకసారి వస్తుంది" అని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోటి ఓట్లతో 90 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 15 మంది కాంగ్రెస్ ఎంపీలను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే బాధ్యత తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జెండా మోసిన వారిని గుర్తుంచుకుంటాం

కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన వారికి ఎలా అవకాశాలు దక్కాయో రేవంత్ వివరించారు. ఎమ్మెల్యే టికెట్ వదులుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ అయ్యారని, ఇప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిస్తున్నారని చెప్పారు. నారాయణఖేడ్ టికెట్ వదులుకున్న సురేశ్ షెట్కార్ ఆ తర్వాత ఎంపీగా గెలిచారని గుర్తుచేశారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కార్యకర్తలు 90 రోజుల్లో 48 లక్షల డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేయించారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 92.35 లక్షలకు పైగా ఓట్లు, 64 సీట్లు దక్కడం వెనుక ఆ కార్యకర్తల శ్రమ ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసేవారినీ, పార్టీకి నష్టం చేసేవారినీ అధిష్ఠానం గమనిస్తోందని వ్యాఖ్యానించారు.

సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి

సంక్రాంతి తర్వాత ప్రజల్లోకి వెళ్తామని రేవంత్ ప్రకటించారు. రోజూ 37 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని, ఈ పథకం కింద ఆర్టీసీకి రూ.13 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, 2.25 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రైతు రుణమాఫీకి రూ.25 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.36 వేల కోట్లు ఇచ్చామన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.75 వేల కోట్ల రుణాలు ఇప్పించామని, రూ.2 వేల కోట్ల వడ్డీని ప్రభుత్వమే చెల్లించిందని వివరించారు. కృష్ణా, గోదావరి నీళ్ల విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రేవంత్ ఆరోపించారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అందుతున్నాయని, బీఆర్ఎస్ నేతల కుటుంబాలు కూడా వాటిని పొందుతున్నాయని అన్నారు. గ్రామాలు, తండాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడాలని కార్యకర్తలను కోరారు.

నేడు కరీంనగర్‌కు బీజేపీ చీఫ్

మొదటి పేజీ తరువాయి



తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి వెళ్తారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ యాత్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రజలు, కార్యకర్తలు నగరానికి చేరుకునేందుకు వెయ్యికి పైగా బస్సులు, 500 మినీ బస్సులు, వ్యాన్లు, రెండు వేల ఆటోలు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యాత్ర మార్గంలో తాగునీటి కౌంటర్లు ఏర్పాటు చేశామని, లక్షకు పైగా మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. నబీన్‌కు స్వాగతం పలికేందుకు ప్రధాన కూడళ్లను కాషాయ జెండాలు, తోరణాలు, కటౌట్లతో అలంకరించారు. డప్పు నృత్యాలతో పాటు రచయిత ఆకుల నాగేశ్వరరావు బృందం ఆటపాటలకు ఏర్పాట్లు చేశారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం.. అరాచకాన్ని అంతం చేద్దాం' నినాదంతో దేశవ్యాప్తంగా 40 చోట్ల బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తోందని, అందులో భాగంగానే కరీంనగర్‌లో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

నీళ్ల చోరీ ఆపాలి

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేసింది. ఈ అంశంపై సోమవారం (నవంబర్ 23) ఉదయం 10.30 గంటలకు పార్టీ ప్రతినిధి బృందం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అధికారులను కలవనుంది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సాగర్‌లో తగినంత నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వనుంది. సొరంగం పనులకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి, ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు ఏమిటి, నీటి తరలింపు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందాలకు అనుగుణంగా ఉందా అనే అంశాలను పరిశీలించాలని బృందం కోరనుంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు దక్కాల్సిన నీటిపై, ముఖ్యంగా హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాపై ఎలాంటి ప్రభావం పడుతుందో బోర్డు పరిశీలించాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీనియర్ ప్రజాప్రతినిధులతో కలిపి సుమారు పది మంది ఈ బృందంలో ఉండనున్నారు.

షర్మిలకు నో ఎంట్రీ

మొదటి పేజీ తరువాయి

అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆదివారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో షర్మిల బెంగళూరు విమానాశ్రయం నుంచి యలహంక ప్యాలెస్‌కు బయలుదేరారు. ఆమె వెంట తల్లి విజయమ్మతో పాటు కుటుంబ సభ్యులు ఉన్నారు. అయితే మార్గమధ్యంలోని ఎయిర్‌ఫోర్స్ క్రాస్ వద్ద పోలీసులు వారి వాహనాలను నిలిపివేశారు. కోర్టు ఉత్తర్వులను చూపించి ముందుకు వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ సందర్భంగా షర్మిల పోలీసులను ప్రశ్నించారు. యలహంకలోని నివాసం తమ కుటుంబ ఆస్తి అని, సొంత ఇంటికి వెళ్లేందుకు అనుమతి ఎందుకు నిరాకరిస్తున్నారని నిలదీశారు. తనకు కోర్టు ఉత్తర్వుల గురించి ముందుగా తెలియదని, పిటిషన్ వేసిన వ్యక్తుల గురించి కూడా సమాచారం లేదని మీడియాకు తెలిపారు. దాదాపు 20 నిమిషాలపాటు పోలీసులతో చర్చించిన అనంతరం షర్మిల, విజయమ్మ సమీపంలోని హోటల్‌కు వెళ్లినట్లు సమాచారం.

కూతురి పెళ్లి ఏర్పాట్లతో వివాదం

యలహంక ప్యాలెస్ వివాదానికి షర్మిల కుమార్తె అంజలి వివాహ ఏర్పాట్లు ప్రధాన నేపథ్యంగా మారాయి. అంజలి వివాహాన్ని నవంబర్ 25న బెంగళూరులోని కుటుంబ నివాసంలో నిర్వహించాలని షర్మిల తొలుత భావించారు. ఈ మేరకు జగన్ అనుమతి కోరారు. అయితే భద్రత, కుటుంబ సభ్యుల వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన కారణాలతో జగన్ అంగీకరించలేదు. వివాహానికి పెద్ద సంఖ్యలో అతిథులు, క్యాటరింగ్, డెకరేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సిబ్బంది వస్తారని, దీనివల్ల కుటుంబ భద్రతకు ఇబ్బందులు తలెత్తవచ్చని అక్టోబర్ 9న షర్మిలకు రాసిన లేఖలో జగన్ పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో వివాహ వేదికను హైదరాబాద్‌కు మార్చినట్లు సమాచారం. అయితే యలహంక ఆస్తిలో తనకూ వాటా ఉందని, కుటుంబ సభ్యురాలిగా అక్కడికి వెళ్లే హక్కు ఉందని షర్మిల వాదిస్తున్నారు.

లీజు హక్కుల కోసం కోర్టుకు సిలికాన్ బిల్డర్స్

యలహంక ప్యాలెస్‌పై తమకు చట్టబద్ధమైన లీజు హక్కులు ఉన్నాయని పేర్కొంటూ సిలికాన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దేవనహళ్లి సివిల్ కోర్టును ఆశ్రయించింది. సంస్థ తరఫున భీమిశెట్టి రమేష్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. వైఎస్ భారతి తల్లి ఈసీ సుగుణమ్మ 2007 మార్చి 1న యలహంక ఆస్తిని తమ సంస్థకు 20 ఏళ్ల కాలానికి లీజుకు ఇచ్చారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ ఒప్పందం 2027 ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. ఆస్తిలో నిర్మాణాలు, పండ్ల తోటలు, ఇతర సదుపాయాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేశామని కోర్టుకు వివరించారు. 2026 ఆగస్టు 27న సుగుణమ్మ తన కుమార్తె భారతి, మనుమరాళ్ల పేర్లపై గిఫ్ట్ డీడ్లు నమోదు చేసినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. గతంలో షర్మిలకు గెస్ట్‌హౌస్‌లో తాత్కాలికంగా ఉండేందుకు అనుమతి ఇచ్చామని, ప్రస్తుతం ఆమె తరఫున ఇతర వ్యక్తులు ప్రాంగణంలోకి వచ్చి ఆస్తి నిర్వహణలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు.

డిసెంబర్ 19 వరకు మధ్యంతర ఉత్తర్వులు

సిలికాన్ బిల్డర్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై దేవనహళ్లి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నవంబర్ 21న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. లీజు ఒప్పందం, అద్దె చెల్లింపులు, విద్యుత్ బిల్లులు, భద్రతకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అనంతరం సంస్థ స్వాధీనానికి తాత్కాలిక రక్షణ కల్పించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని అభిప్రాయపడింది. షర్మిల, ఆమె కుటుంబ సభ్యులు, ప్రతినిధులు, ఆమె తరఫున వ్యవహరించే వ్యక్తులు ఆస్తి స్వాధీనం, నిర్వహణలో జోక్యం చేసుకోకుండా ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉండనున్నాయి.

నేతన్నలకు పింఛన్లు ఏవీ?

మూడు వేల దరఖాస్తులకు 19 మందికే మంజూరా?.. అర్హులందరికీ పింఛన్లు ఇవ్వకుంటే నిరాహార దీక్ష: భోగ శ్రావణి

జగిత్యాల, నవంబర్ 22 (ఈవార్తలు): అర్హులైన నేతన్నలు, కల్లుగీత కార్మికులు, బీడీ కార్మికులకు పింఛన్లు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణి విమర్శించారు. పేద కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడటం ఏమిటని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయకపోతే నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని కమల నిలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

మూడు వేల మందిలో 19 మందికేనా?

జిల్లాలో సుమారు 2,500 నుంచి 3,000 మంది నేతన్నలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 19 మందికి మాత్రమే మంజూరు చేయించారని శ్రావణి ఆరోపించారు. ఇదేనా ప్రభుత్వం చెబుతున్న సంక్షేమమని ప్రశ్నించారు. నిత్యం మగ్గం నేస్తే తప్ప కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్న నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన ప్రతి నేతన్నకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికులకు కూడా పింఛన్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తుల్లో తప్పులు



సరిచేసుకునేందుకు సెప్టెంబర్ 16 వరకు మాత్రమే గడువు ఇవ్వడంతో అనేక మంది అర్హులు అవకాశాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. దరఖాస్తుల్లో పొరపాట్లను సరిదిద్దుకునేందుకు మరో అవకాశం కల్పించాలని కోరారు. వెబ్‌సైట్ మూసివేస్తే పేదలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీడీ కార్మికుల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి అనేక మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారని శ్రావణి తెలిపారు. వారి కుటుంబాల్లో పలువురు మహిళలు బీడీ కార్మికులుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన బీడీ కార్మికులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. పేద కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే వారి ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నేతన్నల సామాజికవర్గానికి చెందిన వారిని చిన్నచూపు చూస్తున్నారని, పార్టీ పదవుల్లోనూ అవకాశాలు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

పింఛన్లు ఇచ్చేవరకు పోరాటం

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చెబుతున్న అభివృద్ధి, సంక్షేమం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని శ్రావణి విమర్శించారు. ఆయన చేస్తున్నది కపట నాటకమని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. అర్హులైన నేతన్నలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్ష చేపట్టడంతోపాటు రోడ్డెక్కి ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. పింఛన్లు మంజూరయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డు కౌన్సిలర్ సిరిపురం శ్రీలత, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ సిరిపురం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పాత రమేష్, ఆముద రాజు, కర్నే రాజేందర్, ఇట్యాల రాము, కుర్మా రమేష్, నక్క జీవన్, కొక్కుల ప్రభాకర్, భోగ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

మల్యాల, నవంబర్ 22 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. 60 ఏళ్ల తర్వాత కల్పిస్తున్న స్వామివారి నిజరూప దర్శనానికి మూడో రోజు కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్తీకమాసంతోపాటు ఆదివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కొండగట్టుకు చేరుకుని అంజన్నను దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 60 ఏళ్ల తర్వాత స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో కొండగట్టుకు తరలివస్తున్నారు. వరుసగా మూడో రోజు కూడా భక్తుల రద్దీ కొనసాగింది.



కొడిమ్యాల కేజీబీవీలో డీఈవో తనిఖీ

భోజన నాణ్యత, బోధన తీరును పరిశీలించిన రాము

కొడిమ్యాల, నవంబర్ 22 (ఈవార్తలు): కొడిమ్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం జగిత్యాల జిల్లా విద్యాధికారి కె. రాము సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బోధనలో అవసరమైన మార్పులు చేపట్టాలని డీఈవో రాము సూచించారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా
చుక్కలు వేయించాలి: మహేందర్ నాయక్

కూకట్‌పల్లి, నవంబర్ 22 (ఈవార్తలు): పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దీనబంధు కాలనీ సొసైటీ అధ్యక్షుడు ఎం. మహేందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పోలియో డే సందర్భంగా దీనబంధు కాలనీలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మహేందర్ నాయక్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. చిన్నారులను పోలియో బారినపడకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. పోలియో నిర్మూలనపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎన్. మంజుల, ఆశా వర్కర్లు ఎం. కరుణ, సీహెచ్. సబిత, బి. రాజేశ్వరి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇఫీ వేదికపై పుస్తకాల ప్రదర్శన

ప్రచురణల విభాగం స్టాల్‌ను ప్రారంభించిన కేంద్ర కార్యదర్శి చంచల్ కుమార్

భారతీయ చరిత్ర, సంస్కృతి, సినిమా, సాహిత్యంపై ప్రత్యేక ప్రచురణలు

గోవా, నవంబర్ 22 (పీఐబీ): గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ-2026) వేదికపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రచురణల విభాగం ప్రత్యేక పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసింది. స్టాల్ నంబర్ 24లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి చంచల్ కుమార్, ప్రచురణల విభాగం డైరెక్టర్ జనరల్ కాంచన్ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. నవంబర్ 20 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఈ చలనచిత్రోత్సవానికి దేశవిదేశాల నుంచి సినీ దర్శకులు, పరిశ్రమ నిపుణులు, ప్రతినిధులు, సినీ అభిమానులు హాజరవుతున్నారు. వీరికి భారతదేశ చరిత్ర, సంస్కృతి, కళలు, సాహిత్యం, సినిమా రంగానికి సంబంధించిన పుస్తకాలను పరిచయం చేసేందుకు ప్రచురణల విభాగం ఈ స్టాల్ ఏర్పాటు చేసింది.



భారతీయ సినిమాపై ప్రత్యేక పుస్తకాలు

స్టాల్‌లో భారతీయ సినిమా పరిణామక్రమం, ప్రముఖ దర్శకుల సృజనాత్మక ప్రస్థానం, సినీ రంగానికి వివిధ వ్యక్తులు అందించిన సేవలను వివరించే ప్రచురణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. సినీ అభిమానులతోపాటు విద్యార్థులు, పరిశోధకులు ఈ పుస్తకాలను పరిశీలించే అవకాశం కల్పించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యం, చారిత్రక వారసత్వం, కళా సంప్రదాయాలు, సాహిత్య విశిష్టతను తెలియజేసే పుస్తకాలు కూడా ప్రదర్శనలో ఉన్నాయి.

1941 నుంచి ప్రచురణలు

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రచురణల విభాగం 1941 నుంచి పుస్తకాలు, పత్రికలను ప్రచురిస్తోంది. భారతదేశ సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతోపాటు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఈ విభాగం ప్రధాన లక్ష్యం. సినిమా, సాహిత్య రంగాల మధ్య అనుబంధాన్ని పెంపొందించేందుకు ఇఫీ వేదిక ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పతన సంస్కృతిని ప్రోత్సహించడంతోపాటు భారతీయ సృజనాత్మకతను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినికి రూ.15 వేల సాయం

కళాశాల ఫీజు కోసం ఆర్థిక సహాయం అందించిన పద్మశాలి ఉద్యోగుల సంఘం

వరంగల్, నవంబర్ 22 (ఈవార్తలు): ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్న బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని మామిడి కల్యాణికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ రూ.15 వేల ఆర్థిక సహాయం అందించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘం సమావేశం సందర్భంగా శాయంపేటకు చెందిన కల్యాణి చదువుకు సహకరించాలని నిర్ణయించారు. సికింద్రాబాద్‌లోని ఈశ్వరీబాయ్ మెమోరియల్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరేందుకు అవసరమైన ఫీజు కోసం రూ.15 వేల సాయం అందించారు. కళాశాల పేరుతో తీసిన చెక్కును తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు విద్యార్థిని కల్యాణికి అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రం రాజమౌళి, జిల్లా ఇన్‌చార్జి కొండబత్తుల రాజమౌళి, సహాధ్యక్షుడు కుసుమ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాస్, కోశాధికారి ఆడెపు నాగరాజు, కార్యవర్గ సభ్యులు దేవులపల్లి సాయిరాజ్, గడ్డం రాజ్‌కుమార్, చిందం లింగమూర్తి, సిరిపురం శేఖర్, కోడూరి రమేష్, గోరంట్ల అశోక్ పాల్గొన్నారు. తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బిట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండు కామేశ్వర్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట, నవంబర్ 22 (ఈవార్తలు): కార్తీకమాసానికి ఆదివారం సెలవు కూడా తోడవడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రద్దీ పెరగడంతో ధర్మ దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. భక్తులు భారీ సంఖ్యలో రావడంతో కొండపైకి వెళ్లే రహదారిలో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్పీఎఫ్ సిబ్బంది వాహనాలను విడతలవారీగా కొండపైకి అనుమతించారు. దర్శనానికి వచ్చిన భక్తులు క్యూలైన్లలో ఎక్కువసేపు వేచి ఉండాల్సి వచ్చింది. కార్తీకమాసం సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మండపంలోనూ రద్దీ కనిపించింది. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతాలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కొండపై దీపారాధన చేసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో కుటుంబాలతో కలిసి వచ్చిన భక్తుల సందడి ఆలయ పరిసరాల్లో కనిపించింది.

టీటీడీకి రూ.50 లక్షల విరాళం

తిరుమల, నవంబర్ 22 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఆర్ ఛాంబర్స్ ఔట్‌సోర్సింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పార్వతి రూ.50 లక్షల విరాళం అందించారు. శనివారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రను కలిసి విరాళానికి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను అందజేశారు. మరోవైపు తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. దర్శన టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం పూర్తయ్యేందుకు సుమారు 18 గంటల సమయం పడుతున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. శనివారం 84,014 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,116 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ద్వారా రూ.4.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు 4.08 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.08 లక్షల మందికి అన్నప్రసాదం అందించినట్లు తెలిపారు.

జనవరి 3న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభ

20 ఏళ్ల సందర్భంగా ద్విదశాబ్ది ఉత్సవాలు
జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, ఆరోగ్య భద్రత కల్పించాలని డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మూడో మహాసభలను జనవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఫెడరేషన్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ద్విదశాబ్ది ఉత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఫెడరేషన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు ఆమోదించారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ తాత్కాలిక అధ్యక్షుడు పిల్లి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజహితం కోసం పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వార్తల సేకరణలో ఎన్నో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం మంత్రి ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తోపాటు ఇతర జిల్లాల్లోని జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఖమ్మం జర్నలిస్టులకు ఇప్పటికే కేటాయించిన స్థలాన్ని అప్పగించాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ముందు పోలీసు విచారణ నిర్వహిస్తున్నారని, ఈ విధానాన్ని



మంత్రి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఆశించిన స్థాయిలో ఉపయోగపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ, గుడిగ రఘు, మాణిక్ ప్రభు, రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు దయాసాగర్, సలీమా, ఈ. చంద్రశేఖర్, గంద్ర నవీన్, జగదీష్, నిరంజన్, వెంకటేష్, భిక్షపతి, విజయానంద్‌రావుతోపాటు రాష్ట్ర కమిటీ, కౌన్సిల్, జాతీయ కౌన్సిల్ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని నలుగురి దుర్మరణం

వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

వికారాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): వికారాబాద్ జిల్లాలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బుగ్గ రామేశ్వరం సమీపంలోని ఘాట్ రోడ్డు మలుపు వద్ద లారీ, ఆటో ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో పెండ్లిమడుగు గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామానికి చెందిన నగేష్, చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత ఆటోలో కేరెళ్లి వైపు వెళ్తున్నారు. బుగ్గ రామేశ్వరం ఆలయం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. ఢీకొన్న తీవ్రతకు ఆటోలో ఉన్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను ఆటో డ్రైవర్ నగేష్, చంద్రమ్మ, పార్వతమ్మ, సరితగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని సమాచారం. పనుల నిమిత్తం కేరెళ్లికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు అందిన సమాచారంలో పేర్కొన్నారు. మలుపు వద్ద లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

వెటర్నరీ వర్సిటీలో 117 అధ్యాపక పోస్టులు

భర్తీకి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 22 (ఈవార్తలు): తెలంగాణలో అధ్యాపక ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయంలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న 117 అధ్యాపక పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది. తొలి విడతలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నవంబర్ నెలాఖరులోగా విడుదల చేసేందుకు వర్సిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నియామకాలతో పశువైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత కొంతమేర తగ్గే అవకాశముంది. ప్రభుత్వం భర్తీకి అనుమతించిన 117 పోస్టుల్లో 67 అసిస్టెంట్ ప్రొఫెసర్, 50 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) మార్గదర్శకాలకు అనుగుణంగా నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. అయితే తుది ఎంపిక విధానం, విద్యార్హతలు, అనుభవం, వయోపరిమితి, రిజర్వేషన్లు, రోస్టర్ వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నారు. వెటర్నరీ వర్సిటీలో అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు మొత్తం 225 పోస్టులను భర్తీ చేయాలని విశ్వవిద్యాలయ పాలక మండలి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిలో 117 బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు గత రెండేళ్లలో ఖాళీ అయిన మరో 108 రెగ్యులర్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం తొలి విడతగా 117 పోస్టులకు అనుమతి లభించగా, మిగిలిన 108 పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక నోటిఫికేషన్ తీసుకువచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఆ పోస్టుల నియామకాలపై తదుపరి అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. నియామక ప్రకటన విడుదలైన తర్వాత దరఖాస్తు విధానం, ఫీజు, గడువు, సబ్జెక్టుల వారీ ఖాళీలు, ఎంపిక ప్రక్రియపై పూర్తి స్పష్టత రానుంది. అభ్యర్థులు విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు పరిశీలించాలని సూచిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో పంతాలకు పోవద్దు: చంద్రబాబు

అమరావతి, నవంబర్ 22 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వ్యక్తిగత పంతాలు, వర్గ విభేదాలకు తావివ్వకుండా నాయకులంతా ఐక్యంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. గ్రామాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు కృషి చేయాలని పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులను కోరారు. ఆదివారం పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాలను ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. పార్టీ గుర్తులపై జరిగిన ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, ఇక గ్రామాభివృద్ధి లక్ష్యంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ నాయకులంతా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలను పెంచినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. గతంలో కనీస ప్రోత్సాహకం రూ.5 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.15 లక్షలకు పెంచామని తెలిపారు. గరిష్ఠ మొత్తాన్ని రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచినట్లు వివరించారు.

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం..

9 మంది మృతి

కోటా, నవంబర్ 22 : రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఖాటూ శ్యామ్ ఆలయాన్ని దర్శించుకుని మహారాష్ట్రకు తిరిగి వెళ్తున్న భక్తుల వాహనం రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కోటా-ఉదయ్‌పూర్ జాతీయ రహదారిపై శంభుపుర గ్రామం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. నాంటా పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రయాణిస్తున్న క్రూయిజర్ వాహనం వేగంగా వెళ్లి ట్రక్కును ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు వాహనం భారీగా దెబ్బతింది. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కోటాలోని ఆసుపత్రులకు తరలించారు. బాధితులు మహారాష్ట్రకు చెందిన కుటుంబ సభ్యులని పోలీసులు వెల్లడించారు. ప్రమాదానికి అధిక వేగం, రహదారి పరిస్థితులు లేదా ఇతర కారణాలు ఏ మేరకు దోహదపడ్డాయనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది.

భారత్‌కు నేపాల్ ప్రధాని బలేంద్ర షా

రెండు రోజుల అధికారిక పర్యటన.. మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, నవంబర్ 22 : నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా ఆదివారం రెండు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు చేరుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఆయన నవంబర్ 22, 23 తేదీల్లో పర్యటిస్తున్నారు. మార్చి 2026లో నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బలేంద్ర షా చేస్తున్న తొలి ద్వైపాక్షిక విదేశీ పర్యటన ఇదే. న్యూఢిల్లీ విమానాశ్రయంలో ఆయనకు భారత ప్రభుత్వ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో బలేంద్ర షా సమావేశమయ్యారు. సోమవారం ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. భారత్-నేపాల్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా, ఇంధనం, విమాన సర్వీసులు, సరిహద్దు కనెక్టివిటీ వంటి అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.



మారుతి కార్ల ధరలు మళ్లీ పెరిగాయి!

ఈ ఏడాదిలో నాలుగోసారి సవరణ.. ఎంపిక చేసిన మోడళ్లపై 0.31 శాతం పెంపు

న్యూఢిల్లీ, నవంబర్ 22 : దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకి వాహనాల ధరలను మరోసారి పెంచింది. పెరుగుతున్న తయారీ ఖర్చుల కారణంగా ఎంపిక చేసిన మోడళ్లు, వేరియంట్ల ధరలను సవరించినట్లు ప్రకటించింది. నవంబర్ 22 నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాదిలో కంపెనీ ధరలను సవరించడం ఇది నాలుగోసారి. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం తాజా పెంపు అమ్మకాల పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకున్న సగటు ప్రకారం 0.31 శాతంగా ఉంది. ఇది అన్ని కార్లకు ఒకే విధంగా వర్తించదు. మోడల్, వేరియంట్ ఆధారంగా ధరల్లో తేడా ఉంటుంది. ఈ ఏడాది జూన్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనూ మారుతి ధరలను సవరించింది. ముడిసరుకు వ్యయం, ఉత్పత్తి ఖర్చులు పెరుగుతుండటంతో మరోసారి ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. సగటు పెంపు శాతాన్ని బట్టి లెక్కిస్తే రూ.5 లక్షల కారు ధరపై సుమారు రూ.1,550, రూ.8 లక్షల కారుపై రూ.2,480, రూ.10 లక్షల కారుపై రూ.3,100 అదనపు భారం పడవచ్చు. అయితే ఇవి కేవలం ఉదాహరణ లెక్కలు మాత్రమే. కొనుగోలుదారులు సంబంధిత డీలర్ వద్ద తమకు కావాల్సిన వేరియంట్ తాజా ధరను తెలుసుకోవాలి.

ప్రసాదం పేరుతో మత్తుమందు

రైలులో బంగారం చోరీ

దంపతులను మోసం చేసిన మహిళ అరెస్ట్

ముంబై, నవంబర్ 22 : రైలు ప్రయాణికులకు ప్రసాదం పేరుతో మత్తుమందు కలిపిన తిను బండారం ఇచ్చి బంగారం చోరీ చేసిన కేసులో మహారాష్ట్ర రైల్వే పోలీసులు 59 ఏళ్ల మహిళను అరెస్ట్ చేశారు. కర్ణాటక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న దంపతులను నిందితురాలు మోసగించినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 15న గోవింద్ కుమార, ఆయన భార్య రైలులో ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో ఓ మహిళ వారితో పరిచయం పెంచుకుని దేవుడి ప్రసాదమంటూ వేరుశనగ చిక్కీ ఇచ్చింది. దాన్ని తిన్న కొద్దిసేపటికే ఇద్దరూ స్పృహ కోల్పోయారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న నిందితురాలు బాధితురాలి మెడలోని సుమారు 50 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని అపహరించి పరారైంది. ఆభరణం విలువ దాదాపు రూ.1.5 లక్షలు ఉంటుందని అంచనా. బాధితుల ఫిర్యాదుతో సోలాపూర్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైలు ప్రయాణించిన మార్గంలోని స్టేషన్లలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో నిందితురాలు ఛత్రపతి శంభాజీనగర్‌లో ఉన్నట్లు గుర్తించి నవంబర్ 16న గీతాదేవి అలియాస్ మీనాదేవి రాంనరేష్ ధోరేను అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా పది రోజుల పోలీసు కస్టడీ విధించారు. నిందితురాలు ఏ మత్తుపదార్థాన్ని ఉపయోగించింది, గతంలోనూ ఇలాంటి చోరీలకు పాల్పడిందా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. రైళ్లలో అపరిచితులు ఇచ్చే ఆహార పదార్థాలను స్వీకరించవద్దని, అనుమానాస్పద ఘటనలు ఎదురైతే రైల్వే హెల్ప్‌లైన్ 139కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

రూ.10,999కే 7,000 ఎంఏహెచ్ ఫోన్

న్యూఢిల్లీ, నవంబర్ 22 : దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా కొత్త బడ్జెట్ స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 'లావా స్మార్ట్ 4 ప్రో' పేరుతో విడుదలైన ఈ ఫోన్ ధర రూ.10,999గా నిర్ణయించింది. ఇందులో 7,000 ఎంఏహెచ్ సామర్థ్యం కలిగిన భారీ బ్యాటరీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. స్మార్ట్ 4 ప్రోలో 6.75 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లేను అమర్చారు. ఇది 90 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌కు సపోర్ట్ చేస్తుంది. యునిసాక్ టీ610 ఆక్టాకోర్ ప్రాసెసర్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో 4జీబీ ర్యామ్, 64జీబీ స్టోరేజ్ ఉన్నాయి. మరో 4జీబీ వర్చువల్ ర్యామ్ సౌకర్యాన్ని అందించారు. మైక్రో ఎస్‌డీ కార్డు ద్వారా స్టోరేజ్‌ను 512జీబీ వరకు పెంచుకోవచ్చు. ఫోన్‌లో 18 వాట్ల ఛార్జింగ్ సపోర్ట్, యూఎస్‌బీ టైప్-సీ పోర్టు ఉన్నాయి. వెనుకవైపు 13 మెగాపిక్సెల్ కెమెరా, ముందు భాగంలో 5 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరాను అమర్చారు. ఆండ్రాయిడ్-16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. భద్రత కోసం ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్ అందించారు. రెండేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్లు, ఒక ఏడాది వారంటీ, ఇంటివద్ద సర్వీస్ సౌకర్యం ఉంటాయని కంపెనీ తెలిపింది. ఇది 4జీ స్మార్ట్‌ఫోన్.



నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో సీట్ల గందరగోళం!

10,105 సీట్లు బ్లాక్ అయినట్లు గణాంకాలు

ఫ్లోట్ విధానంపై పునఃసమీక్షకు అవకాశం

న్యూఢిల్లీ, నవంబర్ 22 : నీట్ పీజీ-2026 కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు విధానంపై వివాదం నెలకొంది. రెండో రౌండ్ తర్వాత దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా పీజీ మెడికల్ సీట్లు 'బ్లాకింగ్' కేటగిరీలో ఉన్నట్లు కౌన్సెలింగ్ సమాచార వేదిక సార్థ గణాంకాలు వెల్లడించాయి. దీంతో కొత్తగా అమలు చేస్తున్న ఫ్లోట్ విధానంపై పునఃసమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సార్థ యాప్ వివరాల ప్రకారం రెండో రౌండ్ ముగిసిన తర్వాత 10,105 సీట్లు బ్లాకింగ్ కేటగిరీలో ఉన్నాయి. ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్‌తో పాటు రాష్ట్రాల కౌన్సెలింగ్‌లోనూ కొందరు అభ్యర్థులు సీట్లు పొందడం ఈ పరిస్థితికి కారణమని వైద్య విద్యా వర్గాలు చెబుతున్నాయి. విభాగాల వారీగా చూస్తే ఎండీ జనరల్ మెడిసిన్‌లో 1,026, ఎంఎస్ ప్రసూతి-గైనకాలజీలో 861, ఎంఎస్ జనరల్ సర్జరీలో 786 సీట్లు బ్లాక్ అయినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ఫ్లోట్ విధానం కింద అభ్యర్థులు తమకు కేటాయించిన సీటును ఉంచుకుంటూనే మెరుగైన సీటు కోసం ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే ఆల్ ఇండియా, రాష్ట్రాల కౌన్సెలింగ్‌లు వేర్వేరుగా జరగడం వల్ల ఒకే అభ్యర్థి రెండు చోట్ల సీట్లను తాత్కాలికంగా నిలుపుకొనే పరిస్థితి ఏర్పడుతోందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఫ్లోట్ సౌకర్యాన్ని మొదటి రౌండ్‌కే పరిమితం చేయడం, రెండో రౌండ్ నుంచి కాలేజీలో చేరడాన్ని తప్పనిసరి చేయడం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం తుది నిర్ణయం ప్రకటించలేదు. సార్థ యాప్ గణాంకాలను అధికారిక సీట్ల ఖాళీలతో సమానంగా భావించకూడదు.

ఆన్‌లైన్‌లో యాంటీ డ్రోన్ గన్ అమ్మకం

ఎయిర్‌వన్ రోబోటిక్స్‌కు రూ.10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, నవంబర్ 22 : ఆన్‌లైన్ వాణిజ్య వేదిక ఇండియామార్ట్‌లో యాంటీ డ్రోన్ గన్‌ను విక్రయానికి ఉంచిన ఎయిర్‌వన్ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) చర్యలు తీసుకుంది. అవసరమైన నియంత్రణ అనుమతులు లేకుండా పరికరాన్ని ప్రచారం చేయడంతో పాటు వినియోగదారులను తప్పుదోవ పట్టించే వివరాలను ప్రదర్శించినందుకు రూ.10 లక్షల జరిమానా విధించింది. సంస్థ 'యాంటీ డ్రోన్ గన్ వీకేఎస్‌పీ03-ప్రో' పేరుతో పరికరాన్ని రూ.8.3 లక్షలకు లిస్ట్ చేసింది. సాంకేతిక వివరాలను పేర్కొంటూ ఉత్పత్తి అందుబాటులో ఉన్నట్లు ప్రకటన ఇచ్చింది. అయితే నియంత్రణలకు లోబడి ఉండాల్సిన పరికరాన్ని తగిన అనుమతులు లేకుండా ఇలా ప్రచారం చేయడం అనుచిత వాణిజ్య విధానమని సీసీపీఏ పేర్కొంది. ప్రకటనలో చూపించినది డమ్మీ పరికరమేనని, వాస్తవ వినియోగానికి ఉద్దేశించినది కాదని సంస్థ వివరణ ఇచ్చింది. కానీ ముందుగా ఇచ్చిన ప్రకటనలోని వివరాలకు ఈ వాదనకు పొంతన లేదని అథారిటీ అభిప్రాయపడింది. వాస్తవంగా విక్రయాలు జరిగాయా లేదా అనే అంశంతో సంబంధం లేకుండా తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంస్థ బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేసింది.

బంగారం ధరల పతనం.. బీజేపీ-కాంగ్రెస్ యుద్ధం

మోదీ సలహాతో నష్టాలు తప్పాయన్న సీటీఐ

కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలన్న బీజేపీ

న్యూఢిల్లీ, నవంబర్ 22 : బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేసుకోవాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలో చేసిన విజ్ఞప్తి మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది. ప్రధాని సూచన వల్ల నగల వ్యాపారులు, మదుపర్లు భారీ నష్టాల నుంచి బయటపడ్డారని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) పేర్కొంది. ఈ మేరకు ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాసింది. బంగారం ధర కిలోకు రూ.1.90 కోట్ల నుంచి రూ.1.25 కోట్లకు తగ్గిందని, ఈ లెక్కన రూ.65 లక్షల వ్యత్యాసం వచ్చిందని సంఘం వివరించింది. బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకున్న వారికి ఈ తగ్గుదల ప్రయోజనం కలిగించిందని అభిప్రాయపడింది. సీటీఐ లేఖపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు.



VANGS
GLOBAL TECHNOLOGIES LLP

NEW YEAR OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹8,124~~ **₹6,499**
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹12,499~~ **₹9,999**
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹16,249~~ **₹12,999**
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Unlimited pageviews & SEO
- ✓ Country & device-wise views

~~₹9,999~~ **₹7,999**
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ WhatsApp & email support
- ✓ Drag & drop theme builder
- ✓ Employee ID card design
- ✓ Custom domain & push alerts

~~₹14,999~~ **₹11,999**
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Custom domain & push alerts

~~₹19,999~~ **₹15,999**
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
- ✓ Automatic PDF extraction
- ✓ Custom domain & push alerts
- ✓ Web stories, gallery, headlines
- ✓ Country & device-wise views

~~₹17,499~~ **₹13,999**
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹22,499~~ **₹17,999**
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
- ✓ Android app + configuration
- ✓ WhatsApp & email support
- ✓ Theme builder & ID card design
- ✓ Web stories, gallery, headlines

~~₹32,499~~ **₹25,999**
20% OFF · SAVE ₹6,500 / YEAR

PLATFORM HIGHLIGHTS

- ◆ Smart AI image extraction
- ◆ AdSense & sponsor ad slots
- ◆ Custom domain + auto SSL
- ◆ One-click publishing
- ◆ WhatsApp sharing
- ◆ AI tagging & SEO tags
- ◆ Real-time analytics
- ◆ AWS cloud · daily backups
- ◆ YouTube video embedding

Try free for 12 days

No credit card required · Turn your print edition into a digital publication

CALL / WHATSAPP
+91 7675087378

EMAIL
hr@vangstechnologies.com

WEBSITE
www.vangstechnologies.com

SCAN TO VISIT OUR WEBSITE

SCAN TO CALL +91 7675087378





27న నెట్‌ఫ్లిక్స్‌లో ఏకే47

ఈవార్తలు, వినోదవాణి: వెంకటేశ్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం-ఏకే47' సినిమా ఓటీటీ విడుదలపై ప్రచారం జరుగుతోంది. నవంబర్ 27 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు సమాచారం. అయితే ఈ తేదీపై చిత్ర బృందం లేదా ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాలో వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి విడుదలైన తొలిరోజు మిశ్రమ స్పందన వచ్చింది. బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. సినిమా కథ చిట్టిబాబు అనే మధ్యతరగతి ఉద్యోగి చుట్టూ సాగుతుంది. వెంకటేశ్ పోషించిన చిట్టిబాబు కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటుంది. భార్య స్వర్ణ చిట్టీల వ్యాపారం

జూనియర్ సైంటిస్ట్‌గా శర్వా

తుది దశకు 'జార్జ్ క్రిష్' షూటింగ్



ఈవార్తలు, వినోదవాణి: హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్' సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. వచ్చే వారంతో చివరి షెడ్యూల్ పూర్తికానున్నట్లు సమాచారం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే డబ్బింగ్ కార్యక్రమాలను ప్రారంభించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో శర్వానంద్ జూనియర్ సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర చుట్టూ సాగే కామెడీ, కుటుంబ కథాంశం ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌లో శర్వానంద్ రెండు భిన్నమైన మతపరమైన వేషధారణల్లో కనిపించారు. ఈ లుక్స్‌కు కథలో ఎలాంటి ప్రాధాన్యం ఉంటుందనే ఆసక్తి నెలకొంది. శర్వానంద్ సరసన మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథను వినోదాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. శ్రీను వైట్ల మార్క్ కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ పూర్తయిన వెంటనే ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయాలని నిర్ణయించారు.

కారణంగా అప్పుల్లో చిక్కుకుంటుంది. కుమార్తె సంపూర్ణ ప్రేమ వ్యవహారాలతో కుటుంబంలో సమస్యలు ఎదురవుతాయి. కుమారుడు శర్వకు గుండె సంబంధిత సమస్య ఉండటంతో ఆపరేషన్ కోసం రూ. 2 లక్షలు అవసరమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో చిట్టిబాబు ఉద్యోగం కూడా కోల్పోతాడు. సమస్యల నుంచి ఎలా బయటపడాలా అని ఆలోచిస్తున్న సమయంలో రూ. 100 కోట్ల లాటరీ తగులుతుంది. దీంతో కుటుంబం కొత్త విల్లాకు మారుతుంది. అయితే భారీ మొత్తంలో డబ్బు వచ్చిందని తెలుసుకున్న బిహార్‌కు చెందిన ఓ ముఠా చిట్టిబాబు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. డ్రైవర్, పనిమనిషి రూపంలో ఇంట్లోకి ప్రవేశించి దాడికి ప్రయత్నిస్తుంది. ఆ ముఠాను చిట్టిబాబు ఎలా ఎదుర్కొన్నాడు? అతడి గతం ఏమిటి? లాటరీ వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? అనే అంశాలతో కథ సాగుతుంది. ఈ చిత్రంలో నారా రోహిత్ పోలీసు అధికారిగా కీలక పాత్ర పోషించారు. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు ఓటీటీ విడుదల కోసం ఎదురుచూస్తుండగా, నవంబర్ 27 స్ట్రీమింగ్ తేదీపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

రణ్‌వీర్‌లో మంచి క్రికెటర్ ఉన్నాడు: సచిన్





ఈవార్తలు, వినోదవాణి: బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌లో మంచి క్రికెటర్ ఉన్నాడని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నారు. '83' సినిమాలో కపిల్ దేవ్ పాత్రలో రణ్‌వీర్ నటనను ఆయన ప్రశంసించారు. ముంబయిలో జరిగిన 'గ్లోబల్ పీస్ ఆనర్స్ 2026' కార్యక్రమంలో వీరిద్దరి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. కార్యక్రమంలో రణ్‌వీర్ మాట్లాడుతూ.. ఇద్దరి పాత్రలు మారితే ఎవరు మంచి క్రికెటర్ అవుతారు, ఎవరు మంచి నటుడు అవుతారని సచిన్‌ను ప్రశ్నించారు. దీనికి సచిన్ సరదాగా స్పందించారు. "అది మంచి గూగ్లీ. మీరు '83' సినిమాలో ఫాస్ట్ బౌలింగ్ చేశారు కదా! కపిల్ దేవ్ పాత్రలో అద్భుతంగా నటించారు. మిమ్మల్ని చూస్తే మంచి క్రికెటర్‌గా కూడా ఊహించుకోవచ్చు" అని సచిన్ అన్నారు. ఈ సందర్భంగా 1983 ప్రపంచకప్ జ్ఞాపకాలను సచిన్ గుర్తుచేసుకున్నారు. కపిల్ దేవ్ ఆటను చూస్తూ పెరిగామని, తన క్రికెట్ ప్రయాణానికి కూడా ఆ ప్రపంచకప్ విజయం ప్రేరణగా నిలిచిందని చెప్పారు. కపిల్ పాత్రకు రణ్‌వీర్ సరైన ఎంపిక అని అభిప్రాయపడ్డారు. "ఎప్పుడైనా నెట్స్‌కు వచ్చి నాకు బౌలింగ్ చేయండి" అని సచిన్ ఆహ్వానించడంతో రణ్‌వీర్ సంతోషం వ్యక్తం చేశారు. క్రికెటర్ల నటన గురించి మాట్లాడుతూ హర్భజన్ సింగ్, శ్రీశాంత్, ఇర్ఫాన్ పఠాన్ వంటి ఆటగాళ్లు సినిమాల్లో నటించిన విషయాన్ని సచిన్ ప్రస్తావించారు. కబీర్ ఖాన్ దర్శకత్వంలో రూపొందిన '83' చిత్రం భారత క్రికెట్ జట్టు 1983 ప్రపంచకప్ విజయాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కింది.

'మైసా' విడుదల వాయిదా



ఈవార్తలు, వినోదవాణి: రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మైసా' సినిమా విడుదల వాయిదా పడింది. నవంబర్ 27న థియేటర్లలోకి రావాల్సిన ఈ చిత్రాన్ని అనుకున్న తేదీకి విడుదల చేయడం లేదని చిత్ర బృందం ప్రకటించింది. సాంకేతికంగా మరింత నాణ్యమైన సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ అన్‌ఫార్ములా ఫిల్మ్స్, దర్శకుడు రవీంద్ర పుల్లే సోషల్ మీడియా వేదికగా సంయుక్త ప్రకటన విడుదల చేశారు. తెలుగు సినిమా సాంకేతికంగా కొత్త స్థాయికి చేరుకుంటోందని, అదే ప్రమాణాలతో 'మైసా'ను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు, విజువల్స్ ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందించేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో నవంబర్ 27న జరగాల్సిన విడుదలను వాయిదా వేసినట్లు వివరించారు. ఈ ప్రకటనపై రష్మిక మందన్న కూడా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చిత్ర బృందం ప్రకటనను పంచుకున్నారు. "సినిమా విడుదల వాయిదా పడింది. కొత్త విడుదల తేదీ ఎప్పుడనేది నాకూ ఇంకా తెలియదు. తెలిసిన వెంటనే మీతో పంచుకుంటాను" అని పేర్కొన్నారు. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజ్ కుమార్ కందమూడితో కలిసి ఆయన కథ అందించారు.

జబర్దస్త్ కమెడియన్లకు రోడ్డు ప్రమాదం

దొరబాబు, రైజింగ్ రాజుకు గాయాలు



ఈవార్తలు, వినోదవాణి: జబర్దస్త్ కామెడీ షో ద్వారా గుర్తింపు పొందిన దొరబాబు, రైజింగ్ రాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పాలకోడేరు మండలం గోరగనమూడి వద్ద అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టింది. కాకినాడలో జనసేన అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు కథనాలు పేర్కొన్నాయి. గోరగనమూడి వద్దకు చేరుకున్న సమయంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కారులో ఉన్న దొరబాబు, రైజింగ్ రాజుకు గాయాలయ్యాయి.

ఏఐతో లక్ష్మణుడి వీరగాథ

'ది లక్ష్మణ' ఫస్ట్ లుక్ విడుదల

ఈవార్తలు, వినోదవాణి: రామాయణంలో లక్ష్మణుడి పాత్రను ప్రధానంగా తీసుకుని 'ది లక్ష్మణ – అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో కొత్త సినిమా రూపొందిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి ఫొటోరియలిస్టిక్ విధానంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భారతదేశంలో ఈ తరహాలో రూపొందుతున్న తొలి చిత్రంగా నిర్మాతలు పేర్కొంటున్నారు. రాముడికి అండగా నిలిచిన లక్ష్మణుడి సాహసాలు, త్యాగాలు, వీరత్వంతో పాటు ఆయన జీవితంలోని అంతగా ప్రచారంలోకి రాని అంశాలను కథలో చూపించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. అత్యాధునిక ఏఐ సాంకేతికతతో వాస్తవికంగా కనిపించే విజువల్స్‌ను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. మాతా రాజేశ్వరి సమర్పణలో భూమాత ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మిస్తున్నారు. పి.రాధాకృష్ణ కథ, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పవన్ మాతా, నితిన్ మాతా నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

మహేశే సినిమాలో విలన్‌గానైనా నటిస్తా



ఈవార్తలు, వినోదవాణి: మహేశ్ బాబు సినిమాలో నటించే అవకాశం వస్తే పాత్ర ఏదైనా అంగీకరిస్తానని నటి అనుపమ పరమేశ్వరన్ అన్నారు. హీరోయిన్‌గానే కాకుండా విలన్ పాత్ర ఇచ్చినా నటించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మహేశ్ బాబు గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో భాగంగా పలువురు హీరోల గురించి అనుపమను ప్రశ్నించారు. మహేశ్ బాబును ఒక్క మాటలో వర్ణించమని అడగగా ఆయన చాలా హ్యాండ్సమ్ అని సమాధానమిచ్చారు. మహేశ్ అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. భవిష్యత్తులో ఆయన సినిమాలో నటించే అవకాశం వస్తే పాత్ర విషయంలో ఎలాంటి పరిమితులు పెట్టుకోనని అనుపమ తెలిపారు. హీరోయిన్‌గా అవకాశం వచ్చినా, ప్రతినాయకురాలి పాత్ర ఇచ్చినా అంగీకరిస్తానని వెల్లడించారు. అయితే మహేశ్ బాబుకు విలన్‌గా నటించాల్సి వస్తే ఓ సరదా సమస్య ఎదురవుతుందని ఆమె చమత్కరించారు. సినిమాలో ఆయనను కోపంగా చూడాల్సిన సన్నివేశం వచ్చినా అలా నటించడం కష్టమవుతుందేమోనని నవ్వుతూ చెప్పారు. "మహేశ్ బాబు ఎదురుగా ఉంటే కోపంగా చూడాల్సిన సన్నివేశంలో కూడా రొమాంటిక్‌గా చూస్తానేమో. డైలాగులు కూడా మర్చిపోతానేమో" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.



శాండ్‌పేపర్ వివాదం ఇప్పట్లో ముగియదు: హెడెన్

ఈవార్తలు, క్రీడావాణి: ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేస్తున్న శాండ్‌పేపర్ గేట్ వివాదం ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదని ఆ దేశ మాజీ క్రికెటర్ మాథ్యూ హెడెన్ అభిప్రాయపడ్డాడు. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన బాల్ ట్యాంపరింగ్ వ్యవహారంలో ఇప్పటికీ సమాధానాలు దొరకని ప్రశ్నలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నాడు. ఈ వివాదంపై క్రికెట్ ఆస్ట్రేలియా చేపట్టనున్న విచారణ నిష్పక్షపాతంగా జరగాలని సూచించాడు. 2018లో దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాళ్లు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా ఉస్మాన్ ఖవాజా వెల్లడించిన అంశాలతో ఈ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఖవాజా వ్యాఖ్యలను ప్రస్తుత కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఖండించగా, డేవిడ్ వార్నర్ మాత్రం ఖవాజాకు మద్దతుగా నిలిచాడు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిన్స్ కెప్టెన్సీపైనా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే కమిన్స్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించే ఉద్దేశం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. బాల్ ట్యాంపరింగ్ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో హెడెన్ మాట్లాడుతూ.. వివాదం నుంచి మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు. క్రికెట్ ఆస్ట్రేలియా స్వయంగా విచారణ చేపట్టినా, స్వతంత్ర సంస్థకు బాధ్యత అప్పగించినా నిర్దిష్టమైన ప్రశ్నలతో ముందుకు వెళ్లాలని సూచించాడు. ప్రస్తుత ఆటగాళ్లతోపాటు 2018 నాటి సిరీస్‌లో పాల్గొన్న డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజా సహా సంబంధిత వారందరి వాదనలు వినాలని హెడెన్ పేర్కొన్నాడు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించాలని కోరాడు. విచారణ పారదర్శకంగా జరగకపోతే క్రికెట్ వ్యవస్థపై అపనమ్మకం కొనసాగుతుందని హెచ్చరించాడు. పాత వివాదాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.

క్రోనే స్కాం కంటే 'శాండ్ పేపర్' పెద్దది!: జెఫ్రీ బాయ్‌కాట్

ఈవార్తలు, క్రీడావాణి: ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన శాండ్‌పేపర్ గేట్ వివాదం, దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ హ్యాన్సీ క్రోనే మ్యాచ్ ఫిక్సింగ్ కుంభకోణం కంటే పెద్దదని ఇంగ్లండ్ మాజీ ఓపెనర్ జెఫ్రీ బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. తన క్రికెట్ జీవితంలో చూసిన అతిపెద్ద కుంభకోణాల్లో ఇదొకటని పేర్కొన్నాడు. అప్పటి ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లకు విధించిన శిక్ష చాలా తక్కువని విమర్శించాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం గురించి జట్టులోని ఇతరులకు కూడా తెలుసన్న ఆరోపణలు తాజాగా మరోసారి తెరపైకి వచ్చాయి. ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ప్రస్తావించిన అంశాలతో వివాదం మళ్లీ రాజుకుంది. డేవిడ్ వార్నర్ ఖవాజా వాదనకు మద్దతు పలకగా, ప్రస్తుత కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తనకు ముందుగా ఈ ప్రణాళిక గురించి తెలియదని స్పష్టం చేశాడు. కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ కూడా తాజా వ్యాఖ్యలతో వివాదాన్ని మరింత తీవ్రం చేశాడు. ఈ నేపథ్యంలో 'ది టెలిగ్రాఫ్' పత్రికకు రాసిన కాలమ్‌లో బాయ్‌కాట్ తీవ్ర విమర్శలు చేశాడు. హ్యాన్సీ క్రోనే మ్యాచ్ ఫిక్సింగ్ వ్యవహారంలో కొద్దిమంది ఆటగాళ్ల ప్రమేయం ఉందని, కానీ శాండ్‌పేపర్ వివాదంలో జట్టు, కోచింగ్ సిబ్బందిలో మరింతమందికి విషయం తెలిసి ఉండొచ్చని ఆరోపించాడు. ముగ్గురు ఆటగాళ్లపైనే బాధ్యత మోపి మిగిలినవారు తప్పించుకున్నారని బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. ఈ ఆరోపణలు ఆయన వ్యక్తిగత వ్యాఖ్యలేనని, వాటిపై వివాదం కొనసాగుతోందని గుర్తించాలి. అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్‌పై కూడా బాయ్‌కాట్ విమర్శలు గుప్పించాడు. వార్నర్ శాండ్‌పేపర్ ఉపయోగించాలనే ఆలోచనను ముందుకు తెచ్చినప్పుడే స్మిత్ అడ్డుకోవాల్సిందని పేర్కొన్నాడు. కెప్టెన్‌గా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించలేదని ఆరోపించాడు. స్మిత్, వార్నర్‌లపై ఐదేళ్ల నిషేధం విధించాల్సిందని బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. బాల్ ట్యాంపరింగ్ వంటి ఘటనలను కఠినంగా ఎదుర్కోకపోతే క్రికెట్‌పై ప్రజల నమ్మకం దెబ్బతింటుందని వ్యాఖ్యానించాడు.



దీపిక హ్యాట్రిక్.. భారత్‌కు మూడో గెలుపు

ఈవార్తలు, క్రీడావాణి: భోపాల్‌లో భారత మహిళల హాకీ జట్టు గోల్స్ మోత మోగించింది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం థాయ్‌లాండ్‌ను 7-0తో ఓడించి వరుసగా మూడో విజయాన్ని అందుకుంది. దీపిక మూడు గోల్స్‌తో హ్యాట్రిక్ సాధించగా, నవనీత్ కౌర్ రెండు పెనాల్టీ స్ట్రోక్‌లను గోల్స్‌గా మలిచింది. ముంతాజ్ ఖాన్, సునెలిత టొప్పో ఒక్కో గోల్ చేశారు. భారత్ అప్పటికే ఓ గోల్‌తో ముందుండగా, దీపిక 10వ, 11వ నిమిషాల్లో వరుస గోల్స్‌తో స్కోరును 3-0కు చేర్చింది. 28వ నిమిషంలో ముంతాజ్ గోల్‌తో తొలి అర్ధభాగం ముగిసేసరికి భారత్ 4-0 ఆధిక్యంలో నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఈ టోర్నీలో ఇప్పటికే మలేసియాను 4-1తో, దక్షిణ కొరియాను 2-1తో ఓడించింది. మంగళవారం చైనాతో తలపడనుంది.



చివరి రోజు ఎనిమిది వికెట్లు తీస్తే భారత్‌దే విజయం

వెల్లింగ్టన్‌లో భారత్ పట్టు

రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 119/2.. కివీస్ ఇంకా 233 పరుగులు వెనుకే

న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ విజయానికి చేరువైంది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (59 నాటౌట్), రచిన్ రవీంద్ర (27 నాటౌట్) క్రీజులో ఉన్నారు. భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కివీస్ ఇంకా 233 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజు భారత్ మరో ఎనిమిది వికెట్లు పడగొడితే ఇన్నింగ్స్ విజయాన్ని అందుకుంటుంది. 352 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్‌కు తొలి ఓవర్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది.

ఈవార్తలు, క్రీడావాణి: కెప్టెన్ టామ్ లాథమ్‌ను జస్‌ప్రీత్ బుమ్రా పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత హెన్రీ నికోల్స్, డెవాన్ కాన్వే ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. అయితే 31 పరుగులు చేసిన నికోల్స్ ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ధ్రువ్ జురెల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో నికోల్స్ వెనుదిరిగాడు. ఈ దశలో కాన్వేకు రచిన్ రవీంద్ర అండగా నిలిచాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న కాన్వే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు రచిన్ కూడా నిలకడగా ఆడటంతో కివీస్ మరో వికెట్ కోల్పోకుండా నాలుగో రోజు ఆట ముగించింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను తొమ్మిది వికెట్ల నష్టానికి 720 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్‌కు 352 పరుగుల ఆధిక్యం లభించింది. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (136), రిషభ్ పంత్ (128) సెంచరీలతో చెలరేగారు. న్యూజిలాండ్ గడ్డపై అత్యధిక టెస్టు స్కోరు నమోదు చేసిన జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. రిషభ్ పంత్ కూడా సేనా దేశాలైన దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల్లో సెంచరీలు చేసిన ఆరో భారత బ్యాటర్‌గా నిలిచాడు. చివరి రోజు న్యూజిలాండ్ బ్యాటర్లు ఎంతసేపు క్రీజులో నిలబడతారనేదే కీలకంగా మారింది. భారత్ త్వరగా వికెట్లు పడగొట్టాలని చూస్తుండగా, కివీస్ మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు పోరాడుతోంది.



టెస్టు చరిత్రలో భారత్ ప్రపంచ రికార్డు

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పరుగుల వరద పారించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తొలి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్ల నష్టానికి 720 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన భారత్, టెస్టు క్రికెట్ చరిత్రలో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఒకే ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకు 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పిన తొలి జట్టుగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులకు ఆలౌట్ కాగా, భారత్ 352 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. ఆరంభం నుంచే భారత బ్యాటర్లు కివీస్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెనర్లు కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ తొలి వికెట్‌కు 130 పరుగులు జోడించారు. జైస్వాల్ 85 పరుగుల వద్ద ఔటైన తర్వాత దేవదత్ పడిక్కల్‌తో కలిసి రాహుల్ రెండో వికెట్‌కు 165 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. పడిక్కల్ 80 పరుగులతో రాణించగా, రాహుల్ 136 పరుగులతో సెంచరీ సాధించాడు. ఆ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి రాహుల్ మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించాడు. గిల్ 98 పరుగులతో సెంచరీకి రెండు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిషభ్ పంత్ కూడా 128 పరుగులతో అద్భుత శతకం సాధించాడు. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత అన్షుల్ కాంబోజ్‌తో ఐదో వికెట్‌కు 75 పరుగులు, ధ్రువ్ జురెల్‌తో ఆరో వికెట్‌కు 54 పరుగులు జోడించాడు. జురెల్, వాషింగ్టన్ సుందర్ ఏడో వికెట్‌కు మరో 54 పరుగులు జతచేశారు. దీంతో తొలి ఏడు వికెట్లకు వరుసగా 50కి పైగా పరుగుల భాగస్వామ్యాలు సాధించిన తొలి జట్టుగా భారత్ ప్రపంచ రికార్డు నమోదు చేసింది. అంతేకాకుండా న్యూజిలాండ్‌పై టెస్టుల్లో ఏ జట్టుకైనా ఇదే అత్యధిక స్కోరు. 1995లో వెల్లింగ్టన్‌లో వెస్టిండీస్ నమోదు చేసిన 660/5 పరుగుల రికార్డును భారత్ అధిగమించింది. న్యూజిలాండ్ గడ్డపై అత్యధిక టెస్టు ఇన్నింగ్స్ స్కోరు రికార్డునూ సొంతం చేసుకుంది. 2019లో బంగ్లాదేశ్‌పై న్యూజిలాండ్ చేసిన 715/6 పరుగుల రికార్డును బద్దలు కొట్టింది.

రాజకీయాల్లోకి చాహల్

ఈవార్తలు, క్రీడావాణి: భారత క్రికెట్ జట్టు స్టార్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రాజకీయాల్లోకి అడుగుపెట్టాడు. శనివారం భారతీయ జనతా పార్టీలో చేరిన అతడికి పార్టీ నాయకత్వం కొత్త బాధ్యతలు అప్పగించింది. బీజేపీ ఓబీసీ మోర్చా ఢిల్లీ విభాగం కార్యవర్గంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించింది. పార్టీలో చేరిన అనంతరం చాహల్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. బీజేపీలో తనకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు అమర్‌పాల్ మౌర్యకు కృతజ్ఞతలు తెలిపాడు. 36 ఏళ్ల చాహల్ 2016 నుంచి 2024 వరకు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. భారత్ తరఫున 72 వన్డేలు, 80 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 121 వికెట్లు, టీ20ల్లో 96 వికెట్లు పడగొట్టాడు. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. టీ20 క్రికెట్‌లో 400 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా చాహల్ రికార్డు సృష్టించాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడాడు. 2025 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ అతడిని రూ. 18 కోట్లకు కొనుగోలు చేసింది. చాహల్‌తోపాటు అసోం, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలకు చెందిన పలువురు నాయకులకు కూడా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కమిటీలో వివిధ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.



పఠాన్ డ్రీమ్ టీమ్ ఇదే..!

ఈవార్తలు, క్రీడావాణి: భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రస్తుత తరం క్రికెటర్లతో తన డ్రీమ్ వరల్డ్ టెస్టు ఎలెవన్‌ను ఎంపిక చేశాడు. ఈ జట్టులో ఆరుగురు భారత ఆటగాళ్లకు చోటు కల్పించడం విశేషం. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశాడు. భారత్, న్యూజిలాండ్ మధ్య వెల్లింగ్టన్‌లో తొలి టెస్టు జరుగుతున్న సమయంలో పఠాన్ తన జట్టును వెల్లడించాడు. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేశాడు. ఈ ఇద్దరూ గత కొంతకాలంగా భారత జట్టుకు మంచి ఆరంభాలు అందిస్తున్నారని పేర్కొన్నాడు. వీరిద్దరూ కలిసి 33 ఇన్నింగ్స్‌లలో 1,205 పరుగులు జోడించిన విషయాన్ని గుర్తుచేశాడు. మూడో స్థానంలో జో రూట్‌కు చోటిచ్చిన



పఠాన్, అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాడు. టెస్టుల్లో 13 వేల పరుగుల మైలురాయిని అధిగమించిన రూట్, అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. నాలుగో స్థానంలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేశాడు. 2025 ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల్లో నాలుగు సెంచరీలతో 700కు పైగా పరుగులు చేసిన గిల్ ప్రదర్శనను ప్రస్తావించాడు. ఐదో స్థానంలో ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌కు అవకాశం ఇచ్చాడు. ఆరో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను ఎంపిక చేశాడు. దూకుడైన బ్యాటింగ్‌తో పంత్ జట్టుకు అదనపు పరుగులు అందించగలడని అభిప్రాయపడ్డాడు. ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, దక్షిణాఫ్రికాకు చెందిన మార్కో యాన్సెన్‌ను తీసుకున్నాడు. ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్‌కు చోటిచ్చాడు. ఈ ముగ్గురి అనుభవం, వికెట్లు పడగొట్టే సామర్థ్యం జట్టుకు బలంగా ఉంటుందని పఠాన్ భావించాడు.

ఇర్ఫాన్ పఠాన్ డ్రీమ్ వరల్డ్ టెస్టు ఎలెవన్: కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, జో రూట్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, మార్కో యాన్సెన్, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్, జస్‌ప్రీత్ బుమ్రా.

ఈవార్తలు
ప్రజావాణి
సోమవారం 23-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

పాత బ్యాటరీలో కొత్త సంపద

మొబైల్ ఫోన్‌లోనో, ఎలక్ట్రిక్ వాహనంలోనో బ్యాటరీ పనికిరాకుండా పోయినా అందులోని ఖనిజాలకు విలువ ఉంటుంది. బ్యాటరీ రకాన్ని బట్టి లిథియం, నికెల్, కోబాల్ట్, మాంగనీస్ వంటి ఖనిజాలను తిరిగి పొందవచ్చు. కొత్త బ్యాటరీల తయారీకి మనం దిగుమతి చేసుకుంటున్న ఖనిజాల్లో కొంతైనా పాత బ్యాటరీల నుంచి సమకూరితే దేశీయ పరిశ్రమకు మేలు. కొన్ని రకాల బ్యాటరీ వ్యర్థాల ఎగుమతిని కేంద్రం నిషేధించిన నేపథ్యంలో ముందుగా తేల్చాల్సిన ప్రశ్న ఒకటుంది. దేశంలోనే మిగిలే ఈ వ్యర్థాలను సేకరించి, శుద్ధి చేసి, తిరిగి పరిశ్రమలకు అందించే సామర్థ్యం మనకు ఎంత ఉంది? విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ (డీజీఎఫ్‌టీ) నవంబర్ 10న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఐటీసీ హెచ్ఎస్ కోడ్ 85491400 పరిధిలోని బ్యాటరీ వ్యర్థాలు, తుక్కు ఎగుమతులపై తదుపరి ఉత్తర్వుల వరకు నిషేధం అమల్లో ఉంటుంది. వాడిన లిథియం అయాన్ బ్యాటరీలను విడదీసినప్పుడు లభించే 'బ్లాక్ మాస్' కూడా దీని పరిధిలోకి వస్తుంది. ఈ పొడి మిశ్రమాన్ని నేరుగా కొత్త బ్యాటరీలో వాడలేం. అందులోని లోహాలను వేరు చేసి, తయారీకి పనికొచ్చే స్థాయికి శుద్ధి చేయాలి. ఆ పని విదేశాల్లో జరిగితే దానివల్ల వచ్చే అదనపు ఆదాయం, ఉపాధి అక్కడికే వెళ్తాయి. అదే పని ఇక్కడ చేయగలిగితే మన పరిశ్రమలకు ముడిసరుకుతో పాటు సాంకేతిక నైపుణ్యమూ సమకూరుతుంది. ఈ ప్రయత్నం నిలదొక్కుకోవాలంటే పాత బ్యాటరీని సేకరించే వ్యక్తి దగ్గర నుంచే ఆలోచించాలి. సురక్షితంగా సేకరించడానికి, నిల్వ చేయడానికి, శుద్ధి కేంద్రానికి తరలించడానికి ఖర్చవుతుంది. దేశీయ కొనుగోలుదారు ఇచ్చే ధర ఆ ఖర్చుకూ సరిపోకపోతే సేకరణే దెబ్బతింటుంది. కొనుగోళ్లు కొన్ని పెద్ద సంస్థల చేతుల్లో కేంద్రీకృతమైతే చిన్న వ్యాపారులకు ధర అడిగే అవకాశం తగ్గుతుంది. అందుకే కొనుగోలు ధరల్లో పారదర్శకత ఉండాలి. చిన్న సంస్థలు కూడా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఈ రంగంలో పనిచేసేలా సాంకేతిక, ఆర్థిక సహాయం అందాలి. సేకరణ పెరిగే కొద్దీ శుద్ధి సామర్థ్యమూ పెరగాలి. ఎక్కడ ఎంత వ్యర్థం వస్తోంది, సమీపంలోని యూనిట్లు ఎంత మేరకు శుద్ధి చేయగలవు అనే లెక్కల ఆధారంగా కొత్త పెట్టుబడులను ప్రోత్సహించాలి. లేకపోతే ఎగుమతి ఆగిన వ్యర్థాలు గోదాముల్లో పేరుకుపోతాయి. దెబ్బతిన్న బ్యాటరీలను అజాగ్రత్తగా నిల్వ చేస్తే అగ్నిప్రమాదం తలెత్తవచ్చు. రక్షణ పరికరాలు లేకుండా వాటిని విడదీసే కార్మికుల ఆరోగ్యమూ ప్రమాదంలో పడుతుంది. శుద్ధి కేంద్రంలో వాడిన నీరు చివరకు ఎక్కడికి వెళ్తోంది, లోహాలను వేరు చేశాక మిగిలిన వ్యర్థాలను ఎలా నిర్వహిస్తున్నారు అనే అంశాలపై కాలుష్య నియంత్రణ మండళ్లు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. అన్ని బ్యాటరీల నుంచి ఒకే రకమైన లోహాలు, ఒకే పరిమాణంలో రావు. తక్కువ నీరు, విద్యుత్‌తో వేర్వేరు రకాల బ్యాటరీలను శుద్ధి చేసే పద్ధతులపై పరిశోధన అవసరం. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన పద్ధతులను పరిశ్రమల్లో అమలు చేయడానికి ప్రభుత్వం తోడ్పడాలి. చివరకు ఈ నిర్ణయం ఎంత మేలు చేసిందో తెలుసుకోవాలంటే మూడు విషయాలు చూడాలి. పాత బ్యాటరీని సేకరించిన వారికి గిట్టుబాటు ధర వచ్చిందా? దాన్ని విడదీసిన కార్మికుడు సురక్షితంగా పనిచేశాడా? అందులోని ఖనిజం మళ్లీ దేశీయ తయారీకి చేరిందా? ఈ మూడింటికీ సమాధానం దొరికినప్పుడే బ్యాటరీ వ్యర్థాల్లోని సంపద దేశానికి దక్కుతుంది.

మేనరికం ఆచారమా? అపచారమా?

పెళ్లి మాట వచ్చినప్పుడు 'మనకు తెలిసిన కుటుంబమే' అంటారు పెద్దలు. ఆ పరిచయం ఒక భరోసా. మరి అదే కుటుంబంలో తరతరాలుగా ఎవరికైనా కంటి చూపు, వినికిడి సమస్యలు ఉంటే ఆ మాట కూడా పెళ్లి చర్చలోకి వస్తుందా? వచ్చినా, దాని గురించి ఎవరిని అడగాలో ఆ యువతీ యువకులకు తెలుసా? బెంగళూరుకు చెందిన ఇరవై ఏళ్ల న్యాయ విద్యార్థిని చార్వి ఎస్. సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో ప్రతి ఇంటికీ సంబంధించిన ఈ ప్రశ్న ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.



- అశోక రెడ్డి
న్యాయవాది - హైకోర్టు
తెలంగాణ రాష్ట్రం

చార్వి తల్లిదండ్రులు దగ్గరి రక్తసంబంధీకులు. ఆమెకు 'కోన్ డిస్ట్రోఫీ' అనే వారసత్వ కంటి వ్యాధి ఉంది. తనకు 40 శాతం దృష్టి వైకల్యం ఉందని ఆమె పిటిషన్‌లో వివరించారు. తల్లిదండ్రుల మధ్య రక్తసంబంధమే ఆమె కంటి సమస్యకు కారణమని తేల్చడానికి వారి బంధుత్వం ఒక్కటే సరిపోదు. చార్వి లేవనెత్తిన ప్రశ్నకు మాత్రం దేశం సమాధానం చెప్పాలి. కొన్ని వారసత్వ వ్యాధుల ముప్పు పెరుగుతుందని వైద్యశాస్త్రం చెబుతున్నప్పుడు, ఆ సంగతి తెలుసుకునే అవకాశాన్ని కుటుంబాలకు ఎవరు కల్పించాలి? నవంబర్ 20న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి నోటీసు ఇచ్చింది. ఆ నోటీసు పరిధి స్పష్టంగా ఉంది. తగిన చట్టం అవసరమా, పాఠశాలలు, కళాశాలల పాఠ్యాంశాలు సహా ఇతర మార్గాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించవచ్చా అనే అంశాలపై కేంద్రం స్పందించాలని కోర్టు కోరింది. వివాహాలపై ఆంక్షలు విధించే చట్టం తీసుకురావాలా అన్నది చట్టసభలు నిర్ణయించాల్సిన విషయమని ధర్మాసనం పేర్కొంది.

ముప్పు ఎంత? ఎవరికి?

కొన్ని వారసత్వ వ్యాధులకు దారితీసే జన్యు మార్పు ఒకరిలో ఉన్నా, వారిలో ఆ వ్యాధి లక్షణాలు కనిపించకపోవచ్చు. దగ్గరి రక్తసంబంధీకులకు ఒకే పూర్వీకుడి నుంచి అలాంటి మార్పు సంక్రమించే అవకాశం ఎక్కువ. తల్లిదండ్రులిద్దరి నుంచి ఆ మార్పు బిడ్డకు అందినప్పుడు వ్యాధి బయటపడవచ్చు. ముప్పు ఎంతన్నది అర్థం కావాలంటే 'రెట్టింపు' అనే ఒక్క మాట కంటే అసలు సంఖ్యలు చెప్పడం మేలు. రక్తసంబంధం లేని దంపతులకు పుట్టే ప్రతి వంద మంది బిడ్డల్లో సుమారు ఇద్దరు లేదా ముగ్గురికి పుట్టుకతోనే ఆరోగ్య లోపం ఉండవచ్చు. తల్లిదండ్రులు మొదటి వరుస కజిన్లు అయినప్పుడు ఆ సంఖ్య దాదాపు ఐదు లేదా ఆరుకు పెరగవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఒక్కో కుటుంబంలో ముప్పును అంచనా వేయడానికి ఆ కుటుంబ వైద్యచరిత్ర కూడా ముఖ్యం. తెలుగు రాష్ట్రాలకు ఈ చర్చ మరింత అవసరం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21)లో, 15-49 ఏళ్ల వయసులో వివాహ అనుభవం ఉన్న మహిళల్లో దేశవ్యాప్తంగా 10.8 శాతం మంది రక్తసంబంధీకుడిని పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ వాటా సుమారు 26 శాతం. అంటే దాదాపు ప్రతి నలుగురిలో ఒకరు. తెలంగాణలో 18 శాతం. తమిళనాడులో 28 శాతం, కర్ణాటకలో 27 శాతం. ఇన్ని కుటుంబాలకు సంబంధించిన విషయంపై తమ భాషలో వైద్య సలహా పొందే సౌకర్యం ఎంతమందికి అందుబాటులో ఉందో రెండు తెలుగు రాష్ట్రాలూ సమీక్షించాలి.



పెళ్లికి సమ్మతితో పాటు అవగాహన కూడా

హిందూ వివాహ చట్టం కొన్ని దగ్గరి బంధుత్వాల్లో వివాహాలపై పరిమితులు విధించింది. అదే సమయంలో, పెళ్లి చేసుకునే ఇద్దరికీ వర్తించే ఆచారం అలాంటి వివాహాన్ని అనుమతిస్తే మినహాయింపు ఇచ్చింది. ఇక్కడ చట్టం చెప్పేది ఆ పెళ్లి చెల్లుబాటు గురించి. తమ పిల్లలకు ఏదైనా వారసత్వ వ్యాధి వచ్చే అవకాశం ఉందా అని ఒక జంట అడిగితే, ఆ ప్రశ్నకు సమాధానం వైద్య సలహా ద్వారా దొరకాలి. ఆచారం పేరుతో ఆ ప్రశ్నను ఇంట్లో అణచివేయడమూ తప్పే. మేనరికం చేసుకున్నారనే ఒక్క కారణంతో పిల్లల ఆరోగ్య సమస్యలకు తల్లిదండ్రులను నిందించడమూ తప్పే. ఒక న్యాయవాదిగా నా అభిప్రాయం ఇదే. జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛకు విలువ ఇవ్వాలంటే, ఆ నిర్ణయానికి అవసరమైన సమాచారానికీ అంతే విలువ ఇవ్వాలి. పెళ్లి చేసుకోవాలనుకునే ఇద్దరూ తమ సందేహాలను గోప్యంగా అడగగలగాలి. తమ కుటుంబంలో ఒకే వ్యాధి పలువురికి ఉంటే దానికి అర్థమేమిటో తెలుసుకోగలగాలి. పరీక్ష అవసరమా, దాని వల్ల ఏం తెలుస్తుందో వైద్యులు వివరించాలి. ఆ తర్వాత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఆ ఇద్దరికే ఉండాలి.

సలహా కోసం ఎక్కడికి వెళ్లాలి?

రేపు ఒక గ్రామంలో ఓ యువతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి 'మా కుటుంబంలో ఇద్దరికి చిన్న వయసులోనే చూపు తగ్గింది. నేను మేనబావను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. ఎవరిని సంప్రదించాలి?' అని అడిగిందనుకుందాం. ఆమెను ఏ ఆసుపత్రికి పంపాలి? అక్కడ నిపుణులు ఎప్పుడు అందుబాటులో ఉంటారు? అవసరమైన పరీక్షకు ఎంత ఖర్చవుతుంది? ఈ మూడు ప్రశ్నలకు స్థానిక వైద్య సిబ్బంది స్పష్టంగా సమాధానం చెప్పగలిగిన రోజునే ప్రభుత్వ అవగాహన కార్యక్రమం ఆ యువతికి అక్కరకొస్తుంది. అందుకు జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జన్యు సలహా సేవలు అందుబాటులోకి తేవాలి. వైద్యులు సూచించిన పరీక్షల ఖర్చు పేద కుటుంబాలకు అడ్డంకి కాకుండా చూడాలి. ఈ సేవలు ఎక్కడ దొరుకుతాయో ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాలకు తెలియజేయాలి. పాఠశాలలో వారసత్వం గురించి పాఠం చెప్పేటప్పుడు విద్యార్థి తన ఇంట్లో చూసిన ఆరోగ్య సమస్య గురించి సంకోచం లేకుండా అడిగే అవకాశం ఉండాలి. ఇప్పటికే దృష్టి, వినికిడి సమస్యలతో జీవిస్తున్న పిల్లలకు చికిత్స, సహాయక పరికరాలు, చదువుకునేందుకు అవసరమైన తోడ్పాటు అందించడం కూడా ఈ చర్చలో భాగం కావాలి. చట్ట సవరణపై భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు. వైద్య నిపుణులు, కుటుంబాలు, వైకల్యాలతో జీవిస్తున్నవారి మాట విని చట్టసభలు నిర్ణయం తీసుకోవచ్చు. ఈలోగా ప్రభుత్వ ఆసుపత్రిలో సలహా అందించడానికి తీర్పు కోసం ఎదురుచూడాల్సిన పనేముంది? ఏ జిల్లాలో సేవలు ఎప్పుడు మొదలవుతాయి, వాటికి ఎవరు బాధ్యత వహిస్తారు, ఎంత నిధి కేటాయిస్తారో ప్రభుత్వాలు ప్రకటించాలి. చార్వి తన మాట వినిపించడానికి దేశ అత్యున్నత న్యాయస్థానం దాకా వెళ్లారు. రేపు మరో యువతి తన కుటుంబ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి అంత దూరం వెళ్లాల్సి వస్తుందా? తన ఊరి ఆరోగ్య కేంద్రం తలుపు తడితే అక్కడే దారి దొరుకుతుందా? పుట్టబోయే బిడ్డ తరఫున చార్వి అడిగిన ప్రశ్నకు పాలకులు ఇవ్వాల్సిన సమాధానం అక్కడే ఉంది.



ఇంట్లో లేకపోతే ఓటేమవుతుంది?

బూత్ స్థాయి అధికారి ఇంటికి వెళ్లే సమయానికి ఒకరు డ్యూటీలో ఉండొచ్చు. మరొకరు చదువు కోసం కొన్నాళ్లు ఊరెళ్లి ఉండొచ్చు. ఇంకో కుటుంబం అదే వీధిలో మరో అద్దె ఇంటికి మారి ఉండొచ్చు. మూడుచోట్లా పాత చిరునామాలో ఓటరు కనిపించకపోవచ్చు. కానీ ఒక్కో సందర్భంలో అధికారి తెలుసుకోవాల్సిన విషయం వేరు.

హైదరాబాద్ వంటి నగరంలో ఓటర్ల జాబితా సవరణకు ఇదే అసలు పరీక్ష. తలుపు తాళం వేసి ఉందన్న ఒక్క కారణంతో అర్హుడైన పౌరుడి పేరు జాబితా నుంచి జారిపోకూడదు. నవంబర్ 22న 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన వివరాల ప్రకారం, హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో 19,41,444 ఓటరు నమోదులను పరిశీలనకు గుర్తించారు. నవంబర్ 20 నాటికి 7,69,112 నమోదుల పరిశీలన పూర్తయింది. ఇంకా 11,72,332 నమోదులను నిర్ధారించాల్సి ఉంది. ఇందులో అధికారుల దృష్టి ఎక్కువగా అవసరమైన అంశం చిరునామా మార్పు. చిరునామా మారినట్లు గుర్తించిన 13,45,333 మందిలో 4,22,994 మంది వివరాలనే అప్పటికి పరిశీలించారు. అంటే ఈ ఒక్క విభాగంలోనే తొమ్మిది లక్షలకు పైగా నమోదులపై స్పష్టత రావాల్సి ఉంది. మరణించినవారి పేర్లు జాబితాలో కొనసాగితే సరిచేయాలి. ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదైతే గుర్తించాలి. శాశ్వతంగా ఇల్లు మారినవారి వివరాలు సవరించాలి. ఈ పనులు సక్రమంగా జరిగితే జాబితాపై అందరికీ నమ్మకం పెరుగుతుంది. అయితే పరిశీలనకు గుర్తించిన ప్రతి నమోదుకూ ఒకే కొలమానం వర్తింపజేస్తే తప్పులు దొర్లుతాయి. ముఖ్యంగా తాత్కాలికంగా ఊరెళ్లినవారికీ, శాశ్వతంగా నివాసం మార్చినవారికీ మధ్య తేడా తెలుసుకోవాలి. పేరు తొలగించే నిర్ణయం తీసుకునే ముందు అందుకు కారణం ఏమిటో సంబంధిత ఓటరికి తెలియాలి. తన వివరాలు చెప్పుకునే అవకాశం ఆ వ్యక్తికి నిజంగా దక్కాలి. జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ నవంబర్ 21న రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో నోటీసులు, విచారణలు, అభ్యంతరాల పరిష్కారంపై చర్చించారు. డిసెంబర్ 22న తుది జాబితా ప్రచురణకు షెడ్యూల్ ఉన్న నేపథ్యంలో అధికారులు వెల్లడించే లెక్కల్లో స్పష్టత అవసరం. ఎన్ని నోటీసులు పరిష్కరించారన్న లెక్క ఒకటి. క్షేత్రస్థాయిలో ఎంతమంది ఓటర్ల చిరునామాలు నిర్ధారించారన్నది మరో లెక్క.



- రామస్వామి చింత,
మహబూబ్‌నగర్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.